


కడియంలో చిరుత



రాజమహేంద్రవరం రిజర్వు ఫారెస్ట్‌లో గత నాలుగు రోజులుగా జాడలేని చిరుత పులి మంగళవారం రాత్రి కడియంలోని ప్రత్యక్షమైంది. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

6

తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ల బదిలీలు

రాజమహేంద్రవరంసిటీ/ రూరల్, సెప్టెంబరు 24 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులు బదిలీలు నిర్వహించారు. ఈ మేరకు తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్ల పోస్టింగ్‌లకు ఉత్తర్వులు జారీ చేశా మని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.

బదిలీ అయిన తహశీల్దార్లు

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం తహశీల్దార్ సీహెచ్.విద్యావతి బదిలీపై కొవ్వూరు (కేఆర్ఆర్‌సీ) సబ్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. రాజమహేంద్రవరం రూరల్ మండల తహశీల్దార్‌గా అల్లూరి జిల్లా పాడేరు తహశీల్దార్ సిహెచ్.శ్రీనివాస్‌ను నియమించారు. ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడ తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్‌ను కొవ్వూరు తహశీల్దార్‌గా బదిలీ చేశారు. జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారి వీహెచ్‌జీఆర్.పాపారావును రాజమహేంద్రవరం అర్బన్‌కు బదిలీ చేశారు. జిల్లా కలెక్టరేట్ భూములు విభాగం సూపరింటెండెంట్ ఎండి మక్బూద్ ఆలీని ఏవోగా బదిలీ చేశారు.

డిప్యూటీ తహశీల్దార్ల బదిలీలు

తొండంగి డిప్యూటీ తహశీల్దార్ ఎం.అఖిలను ఈనాం డీటీ రాజమహేంద్రవరం ఆర్‌డీవో కార్యాలయం, శంఖవరం డీటీ ఎం.కార్తికేయను రాజమహేంద్రవరం ప్రత్యేక డిప్యూటీ తహశీల్దార్, ఎన్నికల డీటీ జీడీ మల్లేశ్వరి రాజమహేంద్రవరం అర్బన్ సీఎస్‌డీటీగా నియమించారు. రంగంపేట డీటీ టీవీవీఎస్‌పి శశిధర్ ప్రత్యేక డీటీ స్పెషల్ కలెక్టర్ (ఎల్ ఎ) రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్ డిటీగా వీఆర్‌పురం నుంచి ఎస్.సుబ్బారావు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు డీటీగా పనిచేస్తున్న జీఎస్ లక్ష్మి రమ్యను సీఎస్‌డిటీగా జిల్లాకు బదిలీ చేసారు. కడియం డీటీ ఎం.కృష్ణ సుధీర్‌ను రాజమహేంద్రవరం వీఐపీ స్పెషల్ కలెక్టర్ (ఎల్ ఎ) ప్రత్యేక డీటీగా బదిలీ చేశారు. స్పెషల్ డీటీ బీవీకే శాస్త్రిని జిల్లా డీసీఎస్‌వోకు బదిలీ చేశారు. రాజమహేంద్రవరం ఆర్‌డీవో కార్యాలయం ఈనాం డీటీ ఎన్‌వీజీ.శేఖర్ ప్రత్యేక డీటీ రాజమహేంద్రవరం , వై.రామవరం డీటీ కె.సుధాకరరావును రాజానగరం డీటీగా బదిలీ చేశారు. ప్రాజెక్టు స్పెషల్ డీటీ యు.రంజిత్ కుమార్‌ను రంగంపేట డీటీగా బదిలీ చేశారు. రంగపేట డీటీ ఎం.సునీతను సీతానగరం బదిలీ చేశారు. రాజమహేంద్రవరం స్పెషల్ డీటీ ఎంవీ.సాయి ప్రసాద్‌ను గోకవరం డీటీగా, రాజమహేంద్రవరం అర్బన్ డీటీ డి.సాయి రామ్ కోరుకొండ డీటీగా బదిలీ అయ్యారు. అనపర్తి మండలం ఎన్నికల డీటీ జి.మహాలక్ష్మి కడియం డీటీగా, రంపచోడవరం డీటీ ఎన్‌వీవీ.సత్యనారాయణ అనపర్తి ఎన్నికల డీటీగా బదిలీ చేశారు. జిల్లా సీఎస్‌డీటీ వి.శ్రీనివాసరావును రాజమహేంద్రవరం అర్బన్, రంపచోడవరం గిరిజన సంక్షేమ స్పెషల్ డీటీ కె.చైతన్య బాబును రూరల్ ఎన్నికల డీటీగా బదిలీ చేశారు. సీతానగరం డీటీ పి.సర్వేశ్వరమూర్తి అదే మండల రీసర్వే డీటీగా, రాజమహేంద్రవరం ఎన్నికల డీటీ ఎ.కుమారిని రాజానగరం డీటీగా బదిలీ చేశారు. రాజమహేంద్రవరం రూరల్ రీసర్వే డీటీ వి.రత్నసాగర్ ను గోకవరం రీసర్వే డీటీ, గోకవరం మండల రీసర్వే డీటీ ఎ.రజనీ కోరుకొండ డీటీగా బదిలీ అయ్యారు. రాజమహేంద్రవరం గెయిల్ డీటీ ఎం.సునీల్ కుమార్‌ను కడియం రీసర్వే డీటీగా బదిలీ చేశారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో జిల్లా సీఎస్‌డీటీ ఐ.సత్యనారాయణను డివిజన్ ప్రత్యేక డీటీ, ఉండి మండలం డీటీ ఎస్‌వీఎస్.నాయుడును కొవ్వూరు డీటీగా బదిలీ చేశారు. ఏలూరు జిల్లా సీఎస్‌డిటీ డీటీ శ్రీనివాసరావును చాగల్లు డీటీగా బదిలీ చేశారు. పెరవలి డీటీ ఎ.కనకదుర్గను ఉండ్రాజవరం డీటీగా, ఉండ్రాజవరం డీటీ కె.పద్మావతిని పెరవలి డీటీగా బదిలీ చేశారు. కొవ్వూరు డీటీ కె.అజయ్‌బాబును గోపాలపురం డీటీగా బదిలీ చేసారు. రాజమహేంద్రవరం స్పెషల్ డీటీ వి.శాంతిప్రియ నల్లజర్ల డీటీగా బదిలీ చేశారు. చాగల్లు డీటీ కె.నిరంజన్ కొవ్వూరు డీటీ ౧, పోలవరం డీటీ ఎస్.ప్రసాదరావును నిడదవోలు డీటీగా బదిలీ చేశారు. చాగల్లు రీసర్వే డీటీ కె . ఆనంద్‌కుమార్‌ను కొవ్వూరు రీసర్వే డీటీ, కొవ్వూరు ఎన్నికల డీటీ ఎం.కమల సుందర్ చాగల్లు రీసర్వే డీటీగా బదిలీచేశారు. గోపాలపురం డీటీ బి.ప్రదీప్ కుమార్‌ను నిడదవోలు రీసర్వే డీటీగా, కొవ్వూరు రీసర్వే డీటీ పివీ సాంబశివరావును రీసర్వే గోపాలరం డీటీగా బదిలీ చేశారు.

పదవులు వరించెన్..

మొదలైన కార్పొరేషన్ పదవుల పందేరం



- ఒక చైర్మన్, 12 బోర్డు మెంబర్లు
- కూటమి పార్టీల శ్రేణుల్లో ఉత్సాహం
- పదవులు దక్కిన వారిలో సంతోషం
- ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కార్పొరేషన్ పదవుల పందేరం మొదలైంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీల నాయకులకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ఆయా పదవులకు ఎంపిక చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. ముఖ్యంగా వర్గాల సమీకరణలను ప్రధానంగా పరిగణలోకి తీసుకున్నట్టు తొలి జాబితా స్పష్టం చేస్తోంది. కార్పొరేషన్ పదవుల జాబితా వెల్లడితో మంగళవారం ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎక్కడ చూసినా ఇదే చర్చ. ఈ పదవుల కోసం ఎదురుచూస్తున్న వారిలోనూ టెన్షన్ పెరిగింది. తాము ఆశిస్తున్న పదవులు దక్కుతాయో లేదోనన్న ఆందోళన కనిపిస్తోంది. ఇక తొలి జాబితాలో చోటు దక్కించుకున్న వారిలో సంతోషానికి అవధులు లేవు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కేడర్‌లలో ఈ పదవుల పంపకం కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఒకే ఒక్క కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. కాకినాడ నగరానికి చెందిన జనసేన నాయకుడు తోట మెహర్ సీతారామ సుధీర్‌ను రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ పదవి వరించింది. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా ఈ సంస్థ చైర్మన్‌గా కాకినాడకు చెందిన మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి తండ్రి భాస్కరరెడ్డి కొనసాగారు. దీంతో మళ్లీ అదే సంస్థ చైర్మన్ పదవి కాకినాడకు దక్కినట్టయింది. ఇక ప్రకటించిన వివిధ కార్పొరేషన్లకు సంబంధించి మొత్తం 13 మంది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు బోర్డు మెంబర్లుగా నియమితులయ్యారు. ఇందులో కాకినాడ జిల్లాకు నలుగురు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన నలుగురు, తూర్పు గోదావరి జిల్లా నుంచి ఐదుగురు ఉన్నారు. నామినేటెడ్ పోస్టుల పందేరానికి తెరదీయడంతో మిగిలిన ఆశావహులు తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు.

పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా సుధీర్

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా జనసేనకు చెందిన తోట సుధీర్‌ను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కసరత్తు చేసి సమర్థుడినే ఎంపిక చేసిందని చెప్పాలి. వృత్తిరీత్యా న్యాయవాది అయిన తోట సుధీర్ గతంలో టీడీపీ లీగల్ సెల్ విభాగంలో సుదీర్ఘ కాలం పనిచేశారు.ఈయన ప్రస్తుతం జనసేన కాకినాడ సిటీ నియోజకవర్గ అధ్యక్షుడిగా, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే కాకినాడ టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్, గాంధీ సెంటినరీ కాలేజీల ప్రెసిడెంట్‌గా ఉన్నారు. వ్యాపార రీత్యా పలు పెట్రోల్ బంకులు, లారీలు ఉన్నాయి. ఈయన తండ్రి గతంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఎస్ఈగా పని చేశారు. సుధీర్ న్యాయవాది అయినా వ్యవసాయం అంటే మక్కువ. ఈయన భార్య వైద్యురాలు. కూతురు వైద్య విద్య చదివి ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. తోట సుధీర్ అల్లుడు పవన్ కల్యాణ్ వ్యక్తిగత వైద్యుడు. దీంతో పవన్‌తో సుధీర్‌కు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. కాకినాడ జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్..తోట సుధీర్ అల్లుడికి సొంత సోదరుడు. అల్లుడి ద్వారా పవన్‌తో సత్సంబంధాలు ఏర్పడడంతో సుధీర్ గతేడాది జూన్‌లో పవన్ సమక్షంలో భీమవరంలో జనసేనలో చేరారు. అప్పటి నుంచి కాకినాడ సిటీ నియోజకవర్గ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.



బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెడతా..

కాకినాడ పోర్టు నుంచి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కాకుండా ఉక్కుపాదం మోపుతా. నాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన డిప్యూటీ సీఎం పవన్, సీఎం చంద్రబాబు, మంత్రి మనోహర్‌కి కృతజ్ఞతలు తెలుపుతున్నా. రేషన్ బియ్యం కేవలం పేదలకే చెందే విధంగా చర్యలు తీసుకుంటా.రాష్ట్రవ్యాప్తంగా బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటా.


కడలి ఈశ్వరి


తుమ్మల పద్మజ


సత్యనారాయణ


జయకృష్ణ

కాకినాడ జిల్లా నుంచి నలుగురు..

కలెక్టరేట్ (కాకినాడ)/పెద్దాపురం/గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 24: కాకినాడ జిల్లాలో నలుగురు వివిధ కార్పొరేషన్ల బోర్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. కాకినాడ రమణయ్యపేటకు చెందిన జనసేన నాయకురాలు కడలి ఈశ్వరి, పెద్దాపురం మండలం పులిమేరు గ్రామానికి చెందిన బీజేపీ నాయకురాలు తుమ్మల పద్మజ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ బోర్డు సభ్యులుగా నియమితులయ్యారు. రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన బేతా సత్యనారాయణ(టీడీపీ), చేబ్రోలు గ్రామానికి చెందిన సూరిశెట్టి జయ నాగకృష్ణ (జయకృష్ణ) (జనసేన)లను నియమించారు.

'తూర్పు'న నలుగురికి...


వేణుగోపాలరాయుడు


వి.రాంబాబు


స్వరూపదేవి


హరికిశోర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 24: స్టేట్ కార్పొరేషన్ కమిటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన నలుగురు కూటమి నాయకులకు స్థానం లభించింది. రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ సీనియర్ నేత యర్రా వేణుగోపాలరాయుడును ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ మెంబరుగా నియమించారు. ఆయన గతంలో శాప్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఏపీ టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా మాజీ డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు, జనసేన నాయకురాలు గంటా స్వరూపదేవి నియమితులయ్యారు. పద్మశాలి వెల్ఫేర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యుడుగా రాజమహేంద్రవరానికి చెందిన మాజీ కార్పొరేటర్ టిహరికిషోర్ (బాబి)ను నియమించారు.

కోనసీమలో నలుగురికి..


చిల్లా జగదీశ్వరి


నరసింహారావు


నాగేశ్వరరావు


ఆనందసాగర్

అమలాపురం/ముమ్మిడివరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాకు చెందిన నలుగురిని రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లలో మెంబర్లుగా నియమించింది. అమలాపురానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలు చిల్లా జగదీశ్వరిని ఏపీ స్టేట్ సీడ్స్ కార్పొరేషన్‌కు డైరెక్టర్‌గా నియమించారు. కాట్రేనికోనకు చెందిన మత్స్యకార నేత నాగిడి నాగేశ్వరరావును ఏపీ స్టేట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్‌కు డైరెక్టర్‌గా నియమించారు. టీడీపీ అధికార ప్రతినిధి మోకా ఆనంద్‌సాగర్‌ను సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. మలికిపురానికి చెందిన జనసేన నాయకుడు గుండుబోగుల నరసింహారావును ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమించింది. టీడీపీ నాయకుడు నాగిడి నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు పార్టీ అధిష్ఠానం కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ డైరెక్టర్ పదవి కేటాయించడం సరికాదన్నారు. తనకు ఈ పదవిని స్వీకరించడం ఇష్టం లేదని, పార్టీ పునరాలోచన చేయాలని కోరారు.



'పొలం పిలుస్తోంది' పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

రైతుల సమస్యలు తీర్చడానికే 'పొలం పిలుస్తోంది'

రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్

పెరవలి, సెప్టెంబరు 24 : రైతుల సమస్యలు తీర్చడానికి కూటమి ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని చేపడుతుందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పెరవలి మండలం కాకరపర్రులో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. లాభసాటి వ్యవసాయంపై వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు రైతులను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ ప్రతి మండలంలో వారానికి నాలుగు గ్రామాలు చొప్పున మంగళవారం, బుధవారం రైతులతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రోన్‌తో పంటలపై పురుగు మందుల పిచికారి విధానాన్ని మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే శేషారావు, ఇతర అధికారులు పరిశీలించారు. అనంతరం యంత్ర పరికరాలు ప్రకృతి వ్యవసాయ సంబంధిత రసాయనాలు మొదలైనవి పరిశీలించారు.కార్యక్రమంలో ఉద్యాన అధికారి సుజాత కుమారి,ఏరువాక కోఆర్డినేటర్ నరసింహారావు,అగ్రికల్చర్ ఏడీఈ చంద్రశేఖర్, ఏవో మేరీ కిరణ్,ఉద్యాన అధికారి శ్రీనివాస్,శాస్త్రవేత్త రవీంద్ర కుమార్,నాయకులు అతికాల శ్రీను,పిప్పర రవి,పెన్మెత్స సుబ్రహ్మణ్య వర్మ, ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి, ఎంపీటీసీ గుడాల రంగారావు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు బంగారు కిరీటం



గోకవరం దేవీచౌక్ సెంటర్‌లో కనకదుర్గమ్మకు భక్తులు రూ.21 లక్షలతో బంగారు కిరీటం చేయించారు. గ్రామానికి చెందిన కంబాల శ్రీనివాసరావు రూ.14 లక్షలు..భక్తులు రూ.7లక్షలు మొత్తం రూ.21 లక్షలతో బంగారు కిరీటం చేయించారు. ఈ కిరీటంతో భక్తులు మంగళవారం గ్రామోత్సవం నిర్వ హించారు. వచ్చే నెల 4న అమ్మవారికి కిరీటాన్ని అలంకరింపజేస్తారు. - గోకవరం



ఇస్సాగో పరిశ్రమ యాజమాన్యంతో గొడవ పడుతున్న గ్రామస్థులు

ఆ పరిశ్రమ వద్దు!

- అస్సాగో ఇథనాల్ పరిశ్రమను తొలగించాలి
- పరిశ్రమ నుంచి వచ్చే వాసన భరించలేకపోతున్నాం
- కంపెనీ యాజన్యంపై మండిపడిన గ్రామస్థులు

గోకవరం,సెప్టెంబరు 24 : ఆ పరిశ్రమ మా ఊరిలో వద్దు.. వెంటనే తీసివేయాలని గుమ్మళ్ళదొడ్డి గ్రామస్తులు డిమాండ్ చేశారు. గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నుంచి వచ్చే దుర్వాసన భరించలేక ఈ నెల 22వ తేదీన స్థానికులు పరిశ్రమ ముందు ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో పరిశ్రమ యాజమాన్యం మంగళవారం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలోని రామాలయం వద్ద బాధిత గ్రామాల ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశం రచ్చరచ్చగా మారింది. గ్రామస్తులంతా పరిశ్రమ యాజమాన్యాన్ని నిలదీశారు. పరిశ్రమ నుంచి విడుదలయ్యే దుర్వాసన తట్టుకోలేకపోతున్నామని, భారీ శబ్దాల కారణంగా రాత్రిపూట నిద్ర ఉండడం లేదని, చిన్న పిల్లలు హడలెత్తిపోతు న్నారన్నారు. పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థపు నీటిని ఏవిధంగా బయటకు తరలిస్తున్నారో వివరణ ఇవ్వాలన్నారు. మా ప్రాణాలు ప్రమాదబారిన పడకుండా ఏయే జాగ్రత్తలు తీసుకున్నారో వివరించాలంటూ పట్టుబట్టారు. యాజమాన్యం నుంచి సరైన సమాధానం కరువైంది.ఎవ్వరు భయపడవద్దని నిజంగా తమ పరిశ్రమ వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తితే పరిశ్రమలో అంబులెన్స్ సిద్ధంగా ఉంచి ఆ వాహనంలో బాధితులను ఆసుపత్రిలో చేర్పిస్తామని సమాధానం ఇవ్వడంతో స్థానికుల్లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాయి.మీ పరిశ్రమ వల్ల మేము అనారోగ్యం పాలవ్వాలా, పైగా మీ అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తారా అంటూ మండిపడ్డారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం అక్కడినుంచి వెళ్ళిపోయింది.సమావేశంలో గుమ్మళ్ళదొడ్డి,అచ్చుతాపురం,బావాజీపేట, వెదురుపాక గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



అ'ధర'హో

- అనూహ్యంగా పెరిగిన కొబ్బరి ధరలు
- వెయ్యి కాయ రూ.18వేల నుంచి రూ.20వేలు
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతులే కారణం
- కొబ్బరి రైతుల్లో హర్షాతిరేకాలు

అయినవిల్లి, సెప్టెంబరు 24: కోనసీమ కొబ్బరికాయల ధరలు రెట్టింపుకుపైగా పెరిగాయి. శ్రావణమాసంలో వెయ్యి కాయలు రూ.9వేలు ధర ఉండగా ప్రస్తుతం వెయ్యి కొబ్బరికాయలు రూ.18వేల నుంచి రూ.20వేలకు చేరుకుంది. దసరా, దీపావళి, కార్తీకమాసం ముందు ఉన్నందున ధరలకు డోకాలేదని వ్యాపారవర్గాల వారు భావిస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో కొబ్బరికాయల ఉత్పత్తి గణనీయంగా తగ్గడం, దేశవ్యాప్తంగా కొబ్బరికాయలకు డిమాండ్ అనూహ్యంగా పెరగడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి కోనసీమలో కొబ్బరి రైతులు ధర లేక దిగుబడి రాక విలవిల్లాడారు. నల్ల తెగులు, తెల్లదోమ తెగులువల్ల ఎకరాకు 300 కాయలు దిగుబడి మాత్రమే వచ్చేది. ఉత్పత్తి వ్యయాలు పెరిగిపోయి గిట్టుబాటు కాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో కొబ్బరిలో అంతర పంటలైన కోకో, పోక సాగుకు ఉద్యానశాఖ రాయితీపై మొక్కలు అందించేవారు. వైసీపీ పాలనలో ఉద్యానశాఖ అంతర పంటల సాగు ప్రోత్సాహకాలు నిలిపివేశారు. దీంతో రైతులు కొబ్బరిపైనే ఆధారపడే పరిస్థితి నెలకొంది. కొబ్బరి ధరలు ఆశాజనకంగా ఉండడం వలన రూ.9వేల రేటులోనే వ్యాపారస్తులు రైతుల నుంచి కొబ్బరికాయలు సేకరించి నిల్వ ఉంచుకోవడం వలన రైతుల కన్నా వ్యాపారస్తులకే పెరిగిన ధరలు లాభించాయని రైతులు అంటున్నారు. ఎండుకొబ్బరి క్వింటాల్‌కు రూ.15,500, కొబ్బరినూనె కిలో రూ.320, వర్జీనియా కోకోనట్ ఆయిల్ కిలో రూ.500 ధరలు పెరిగాయి. పచ్చికొబ్బరికాయలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ముంబై, రాజస్థాన్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహరాష్ట్ర, చత్తీస్‌గఢ్, హర్యానా రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు కొబ్బరికాయలు కొనుగోలుకు కోనసీమ కేంద్రంగా చేసుకోవడంతో ధరలు పెరిగాయని వ్యాపారులంటున్నారు. సాధారణంగా బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా తదితర రాష్ట్రాలకు ఒలిచిన కొబ్బరికాయలు ఎగుమతి అవుతాయి. ప్రస్తుతం కొబ్బరికాయలకు డిమాండులో ఒలుపు చేయని కాయలను కొనుగోలు చేస్తున్నారు. టన్ను రూ.50వేలు వంతున అమ్మకాలు జరుపుతున్నట్టు వ్యాపార వర్గాలు అంటున్నారు.



రికార్డు ధర.. ఏడేళ్ల తరువాత కొబ్బరికాయలకు రికార్డు స్థాయిలో ధర వచ్చింది. 2017లో కొబ్బరికాయలు రూ.15వేలు ధర పలుకగా 2024లో రూ.20వేలు ధర పలకడం విశేషం. మార్కెట్‌లో ఈ స్థాయి ధర రావడం అరుదని రైతులు, వ్యాపారులు అంటున్నారు. పచ్చికొబ్బరికాయలతో పాటు కొబ్బరి ఉత్పత్తుల ధరలు పెరిగాయి. పాత కురిడీకాయ గండేలా వెయ్యింటికీ రూ.14వేలు, గటగటా రూ.17,500, కురిడీ కొత్తకాయ గండేరా రూ.13వేలు, గటగటా రూ.15,500 ధరలు పలుకుతున్నాయి.

సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్రంలోని సబ్-రిజిస్ట్రార్ల బదిలీల్లో భాగంగా జిల్లాలోని సబ్-రిజిస్ట్రార్ల అందరికీ స్థాన చలనం కల్పించింది. అయితే, ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. గరిష్ఠ కాల పరిమితితో సంబంధం లేకుండా బదిలీలు చేశారు. జిల్లాలోని సబ్-రిజిస్ట్రార్లు అందరూ ఆయా స్థానాల్లో నియమితులై సుమారు రెండేళ్లు మాత్రమే దాటింది. సాధారణంగా సబ్-రిజిస్ట్రార్లను మూడున్నరేళ్లు బదిలీ చేయరు. దీంతో మంచి స్థానాలు 'దక్కించుకున్న' వారు మినహా మిగతా వాళ్లు మనస్థాపం చెందుతున్నారు. రాజమహేంద్రవరం, కడియం, రాజానగరం, పిడింగొయ్యి స్థానాలకు 'ధర' ఎక్కువగానే పలికిందని ఉద్యోగ వర్గాల్లో చర్చనడుస్తోంది. ఈసారి యూ నియన్ల జోనల్ స్థాయి నాయకులను కూడా కూటమి ప్రభుత్వం బదిలీ చేసింది.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
ఎం.రాజబాబు	రాజమహేంద్రవరం-1	నిడదవోలు
ఆర్.రాంబాబు	ముమ్మిడివరం	రాజమహేంద్రవరం-1
పుల్లంరాజు	వట్లూరు	రాజమహేంద్రవరం-2
సీహెచ్ శ్రీనివాసబాబు	కొత్తపేట	బిక్కవోలు
ఇ.లక్ష్మీ	సామర్లకోట	కడియం
కె.కమలప్రియ	రాజమహేంద్రవరం-2	అనపర్తి
త్రినాథ్	కంకిపాడు	పిడింగొయ్యి
వీవీఎస్‌బీ శ్రీనివాస్	భీమడోలు	కోరుకొండ
ఐహెచ్ఆర్‌కే ప్రసాద్	కోరుకొండ	సీతానగరం
కె.సుందరరావు	పిడింగొయ్యి	కొవ్వూరు
మోహన్	కొవ్వూరు	వేగేశ్వరపురం
వి.వెంకటేశ్వర్లు	నిడదవోలు	రాజానగరం
ఇ.వెంకటేశ్వరరావు	కొవ్వూరు	అనంతపల్లి

పునరావాస కమిషనర్‌కే పోలవరం అడ్మినిస్ట్రేటర్ బాధ్యతలు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

రంపచోడవరం, సెప్టెంబరు 24: పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా ప్రస్తుతం రాష్ట్ర పునరావాస కమిషనర్‌గా ఉన్న ఎస్.రామ సుందర్‌రెడ్డికే అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోలవరం అడ్మినిస్ట్రేటర్ పోస్టు గత కొంతకాలంగా ఖాళీగానే ఉంది. ఈ పోస్టుకు రెగ్యులర్ అధికా రిని గత కొంతకాలంగా నియమించటంలేదు. పోలవరం అడ్మి నిస్ట్రేటర్ పోస్టుతో పోలవరం ప్రాజెక్టు పునరావాస అంశాలు, భూ సేకరణ, పరిహారాల చెల్లింపు అంశాలు ముడిపడి ఉండటం, ఈ అంశాలకు సంబంధించి గత కొంత కాలంగా అనేక ఆరోపణలు వస్తుండటంతో ఈ పోస్టుకు అక్రమాలను సైతం ధైర్యంగా వెలికి తీసే అధికారి కోసం ప్రభుత్వం వెతుకుతోంది. దీంతో అంతవరకూ ఈపోస్టుకు పునరావాస కమీసనర్‌నే అదనపు బాధ్యతగా నియమించింది.

గిరిజన సంక్షేమశాఖ ఈఈగా శ్రీనివాసరావు



రంపచోడవరం, సెప్టెంబరు 24: రంపచోడవరం గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఐ.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ 1985లో గిరిజన సంక్షేమశాఖలో జాయిన్ అయ్యానని, వివిధ హోదాలో పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చానన్నారు. ఏజెన్సీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

సహ ఉద్యోగి నుంచి వేధింపులపై ఉద్యోగిని ఫిర్యాదు


మాట్లాడుతున్న ఉద్యోగిని

కాకినాడ సిటీ, సెప్టెంబరు 24: తాను పనిచేసే కార్యాలయంలో సహ ఉద్యోగి నుంచి లైంగిక వేధింపులు అధికమయ్యాయని, ఇంట్లో ఎవరూ లేనప్పుడు చెప్పు వస్తానంటున్నాడని కాకినాడ ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ డీసీపీ యూనిట్ మహిళా ఉద్యోగిని ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక డాల్ఫిన్ కాలనీలోని బీజేపీ సీనియర్ నాయకుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బాధితురాలు తన భర్తతో కలిసి మాట్లాడారు. తాను ఉద్యోగంలో చేరిన కొద్దిరోజుల్లోనే సహ ఉద్యోగి నుంచి లైంగిక వేధింపులు మొదలయ్యాయన్నారు. విషయం తెలుసుకుని పీడీ అడిగితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేశానని, తర్వాత కలెక్టర్‌కు, ఎస్పీకి, సీఐకి ఫిర్యాదు చేశానన్నారు. దీంతో పీడీ పిలిచి నీకు ఇష్టం ఉంటే చేయి లేకపోతే ఉద్యోగం మానేయమని ఇబ్బంది పెడుతున్నారన్నా రు. ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్‌లోనే ఈ విధంగా జరిగితే తాను ఎవరికి చెప్పుకోవాలని, తనకు న్యాయం చేయాలని బాధితు రాలు కోరారు.

దేశ అంతర్గత రక్షణకు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ దిక్సూచి

- 'నన్నయ' ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు


పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 24: త్రివిధ దళాలు దేశ సరిహద్దులో రక్షణ కవచంగా ఉంటే ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ దేశ అంతర్గత రక్షణకు, భవిష్యత్‌కు దిక్సూచిగా నిలుస్తాయని ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వెస్ట్‌జోన్ ఎన్‌సీసీ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరం ఎంపికలను మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ వివిధ స్థాయిల్లో జరిగే ఎంపికల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి వచ్చే ఏడాది జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవంలో నన్నయ విశ్వ విద్యాలయ ఔన్నత్యానికి చిహ్నాలుగా నిలవాలన్నారు. విద్యతో పాటు సమాజహితమైన కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఎన్ఎస్ఎస్ రాష్ట్ర యువజన అధికారి ఎం.సైదా మాట్లాడుతూ ఈ శిబిరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రీ రిపబ్లిక్ డే శిబిరానికి ఎంపిక చేస్తామన్నారు. అందులో ప్రతిభావంతులైన వారిని ఢిల్లీ శిబిరానికి ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రతిభావంతులను ఎంపిక చేయడానికి ఏఏ అంశాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారో వివరించారు. మంగళవారం జరిగిన ఎంపికలకు ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి 155 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హాజరయ్యారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీసీ మొక్కను నాటారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం వసూలు చేసిన రూ.30వేల చెక్కును ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ పీవో పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నవోదయాలో ప్రవేశానికి దరఖాస్తుల గడువు పెంపు

పెద్దాపురం, సెప్టెంబరు 24: జవహర్ నవోదయా విద్యాలయాలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును మరోసారి పెంచినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. నవోదయా విద్యాలయ సమితి ఆదేశాల మేరకు వచ్చేనెల 7వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు తెలిపారు. ప్రవేశపరీక్ష 18.1.2025న జరుగు తుందని, వచ్చేనెల 8, 9 తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సవరణలు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


పాములేరు వాగులో గాలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు

దొరకని మెడికో ఆచూకీ

- కొనసాగుతున్న గాలింపు చర్యలు
- డ్రోన్ కెమెరాతో జల్లెడ పడుతున్న అధికారులు

మారేడుమిల్లి, సెప్టెంబరు 24: అల్లూరిజిల్లా మారేడుమిల్లి జల తరంగిణిలో ఆదివారం కొట్టుకుపోయిన మెడికల్ విద్యార్థి చింతకుంట్ల హరదీప్ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. ఆదివారం జరిగిన ఈ దుర్ఘటన అనంతరం సహాయక చర్యలు చేపట్టిన అధికారులు సోమవారం ఇద్దరు వైద్య విద్యార్థినుల మృతదేహాలను కనుగొన్న సంగతి తెలిసిందే. మరొక విద్యార్థి హరదీప్ ఆచూకీ కోసం మంగళవారం కూడా ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో కొండ వాగులు, కల్వర్టులు క్షుణ్ణంగా పరిశీలించారు. అయినప్పటికీ విద్యార్థి జాడ కన్పించక పోవడంతో రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి డ్రోన్ కెమెరాను వినియోగిస్తూ అనువనువునా జల్లెడ పడుతున్నారు. జలతరంగిణి నుంచి నీటి ప్రవాహం పలు కల్వర్టులు, దట్టమైన పొదలు మీదుగా ప్రవహిస్తూ పాములేరు వాగులోకి అక్కడి నుంచి గోదావరి నదిలోకి నీటి ప్రవాహం చేరుకొనే అవకాశం ఉండడంతో ఆదిశగా గాలింపు చర్యలను పోలీసు అధికారులు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా ఎన్‌డీఆర్ఎఫ్‌తో పాటు ప్రత్యేక బృందం డ్రోన్ కెమెరా సాయంతో పాములేరు వాగులో కొన్ని కిలోమీటర్ల మేర గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం బాగా చీకటిపడడంతో పాములేరు వాగు ప్రమాదకరంగా ఉండడంతో తిరిగి బుధవారం ఈ గాలింపు చర్యలను ముమ్మరం చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. సబ్‌కలెక్టరు కల్పశ్రీ, తహశీల్దారు సుబ్బారావు, సీఐ మురళీకృష్ణ గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.


డ్రోన్ కెమెరా వినియోగాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

- బొలెరో వ్యాన్‌ను బైక్‌తో ఢీకొని అక్కడికక్కడే మృత్యువాత
- మృతులు చొప్పెల్ల, దుళ్ల వాసులు

అలమూరు, సెప్టెంబరు 24: ఆగి ఉన్న బొలెరో చేపల వ్యాన్‌ను బైక్‌తో వచ్చి ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇరువురు అక్కడిక్కడే మృత్యువాత పడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆల మూరు మండలం జొన్నాడ వద్ద జాతీయరహదారిపై మంగళవారం రావులపాలెం నుంచి పాత బ్రిడ్జి మీదుగా వస్తున్న మత్స్యకారుల చేపల వ్యాన్ ఏటిగట్టు నుంచి కపిలేశ్వరపురం వెళ్లేందుకు ఆగుతుండగా అదే దారిలో బైక్ వస్తున్న ఆలమూరు మండలం చొప్పెల్లకు చెందిన వానపల్లి రాజేష్(30), కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన వేగిరాజు సీతారామరాజు(36) ఆగుతున్న వ్యాన్‌ను గుర్తించకపోవడంతో వెనుక నుంచి బలంగా ఢీకొన్నారు. దీంతో వారు ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. ఇంత భారీ ప్రమాదం జరిగి ఇరువురు మృతి చెందిన వారిలో ఒకరికి కూడా కనీసం గాయం కాకుండా మృత్యువాత పడటం ఆశ్చర్యం కలిగిస్తుంది. వెల్డింగ్ సామాన్లు కొనుగోలు చేయడానికి రావులపాలెం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బంధువుల ఫిర్యాదు మేరకు ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయాం


వానపల్లి రాజేష్ (ఫైల్)

జొన్నాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వానపల్లి రాజేష్(30) వయస్సుకు చిన్నవాడే అయినప్పటికీ కుటుంబానికి ఆయన దిక్కు. చొప్పెల్ల గ్రామనివాసి అయిన రాజేష్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. దీంతో కుటుంబ భారం ఆయన తీసుకుని సోదరి వివాహంచేశారు.అవివాహితుడైన రాజేష్ తల్లికి పెద్ద దిక్కుగా ఉన్నాడు. రాజేష్ ఇటుకబట్టీ నిర్వహిస్తున్నాడు. కు టుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

దుళ్లలో విషాదఛాయలు


వి. సీతారామరాజు(ఫైల్)

కడియం: జొన్నాడవద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన వేగిరాజు సీతారామరాజు (36) మృత్యువాత పడ్డాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సీతారామరాజుకు భార్య కోటేశ్వరి, 12ఏళ్ల కొడుకు షణ్ముఖ చైతన్య, 8ఏళ్ల కుమార్తె సాయికృష్ణ తేజస్విని ఉన్నారు. సీతారామరాజు తండ్రి సోలోమాన్‌రాజు డయాలసిస్ పేషెంట్. రెండు రోజులకొకసారి డయాలసిస్ చేయించాల్సిన పరిస్థితి. సీతారామరాజు వెల్డింగ్‌పని చేస్తూ ఆ కుటుంబానికి జీవనాధారంగా నిలిచాడు. ఇంటికి ఆధారమైన కొడుకు చనిపోడంతో ఆ కుటుంబం రోదన వర్ణనాతీతం. సీతారామరాజు కుటుంబాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కూటమి నాయకులు చిట్టూరి అమ్మిరాజు, గుర్రపు సత్యనారాయణ, దేవినాగేశ్వరరావు, కంటిపూడి శ్రీను, సత్యనారాయణ, గోపీ ప్రసాద్, రాజు పరామర్శించారు.

రోడ్డు కం రైలు బ్రిడ్జి పైనుంచి దూకి

గోదావరిలో వ్యక్తి గల్లంతు

- భీమవరానికి చెందిన వ్యక్తిగా గుర్తింపు

కొవ్వూరు, సెప్టెంబర్ 24: కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి వ్యక్తి గల్లంతయ్యాడు. మంగళవారం సాయంత్రం కొవ్వూరు, రాజమహేంద్రవరంల మధ్య గోదావరిపై ఉన్న రోడ్డు కం రైలు బ్రిడ్జి 127వ స్తంభం వద్ద బైక్‌ను పార్క్‌చేసి ఒక వ్యక్తి గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జి.జి.ప్రకాష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బైక్‌ను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బైక్ పై భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్టిక్కర్ అంటించి ఉండడం, నంబరు ప్లేట్ ఆధా రంగా భీమవరం వ్యక్తిగా గుర్తించి భీమవరం పోలీసులకు సమాచారం అందించారు. గల్లంతైన వ్యక్తి భీమవరం మోటుపల్లి వీధికి చెందిన కార్పెంటరీ వర్కర్ నాయుడు సుబ్రహ్మణ్యంగా గుర్తించారు. బంధువులు అందించిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. గల్లంతయిన సుబ్రహ్మణ్యం కోసం గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు.

త్రుటిలో తప్పిన ఘోర బస్సు ప్రమాదం



రెండవవైపు రోడ్డులో పాకలోకి దూసుకు వెళ్లిన ట్రావెల్ బస్సు

తొండంగి,సెప్టెంబరు 24: ఘోర బస్సు ప్రమాదం త్రుటిలో తప్పడంతో దానిలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ట్రావెల్ బస్సు మంగళవారం తెల్లవారు జామున కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి వచ్చే సమయానికి టైర్ పంచర్ పడింది. దీంతో అది అదుపుతప్పి డివైడర్ మీదుగా దూసుకుంటూ రెండవ వైపు రోడ్డులోకి ప్రవేశించి అక్కడ ఉన్న పాకలోకి వెళ్లి ఆగింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సు ఇవతలి రోడ్డులోకి దూసుకు వచ్చే సమయానికి అటువైపుగా ఏదైనా వాహనం వచ్చి ఉంటే ఘోర ప్రమాదం జరిగేది. బస్సులో సుమారు 40మంది ప్రయాణికులు ఉన్నారు. ఏమి జరిగిందో అర్థంకాక వారంతా ఆందోళనకు గురయ్యారు. ప్రమాదం తప్పిన తీరు తెలుసుకుని తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డ సంఘటనను తలచుకుని భయాందోళనకు గురయ్యారు.

అన్నవరంలో రివర్స్ టెండరింగ్ ద్వారా

నెయ్యి కొనుగోలు

- ఆంధ్రజ్యోతి కథనంపై దేవస్థానం అధికారుల వివరణ
- సింహాచలంలో కిలో నెయ్యి రూ.385.41కు, అన్నవరం దేవస్థానంలో 538.60

అన్నవరం, సెప్టెంబరు 24: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో నెయ్యి కొనుగోలుపై ఆంధ్రజ్యోతిలో అన్నవరం అవినీతి కథనంపై జిల్లా కలెక్టర్ వివరణ కోరడంతో మంగళవారం దేవస్థానం అధికారులు వివరణ ఇచ్చారు. అన్నవరం దేవస్థానంలో నెయ్యి కొనుగోలు ఈప్రొక్యూర్‌మెంట్, రివర్స్ టెండరింగ్ ద్వారా దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులకు లోబడి కొనుగోలు చేశామని వచ్చిన నెయ్యిని అక్యురేట్ ల్యాబ్ ద్వారా శాంపిల్స్ రిపోర్టు తీసుకుని సంతృప్తికరంగా ఉంటేనే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. సింహాచలం దేవస్థానంలో లక్కవరంకు చెందిన రైతు డైరీ కిలో నెయ్యి రూ.385.41 కి టెండర్‌ద్వారా కొనుగోలు చేయగా అన్నవరం దేవస్థానంలో అదేసంస్థ రూ.538.60కి కోట్ చేసిందని పేర్కొన్నారు. అన్నవరందేవస్థానంలో నాణ్యమైన నెయ్యిని వాడుతున్నామని, ఇటీవల స్వామివారి ప్రసాదానికి కేంద్రప్రభుత్వం నాణ్యత పరిశీలిం చి ఎఫ్ఎస్ఎస్ఏఐ ధృవీకరణపత్రం అందజేసిందని వివరణ ఇచ్చారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మండపేట, సెప్టెంబరు 24: పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను అత్యాచారం చేసిన యువకుడిపై మంగళవారం మండ పేట రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. మండపేట రూరల్ ఎస్ఐ సురేష్‌బా బు తెలిపిన వివరాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా మండపేట మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక రాజమహేంద్ర వరంలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. బాలికను ప్రేమిస్తున్నానని రాజానగరం మండలం తుంగపాడుకు చెందిన యువకుడు సతీష్ సోమవారం బైక్‌పై తీసుకువెళ్లి అత్యాచారా నికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదుపై ఆ యువకుడిపై మంగళవారం మండ పేట రూరల్ సీఐ పీతల దొరరాజు ఆధ్వర్యంలో పోక్సో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హరికోటి శాస్త్రి తెలిపారు.

కడియంలో చిరుతపులి సంచారం

- పాదముద్రలు పరిశీలించిన అటవీశాఖ అధికారులు
- అవి పులివేనని నిర్ధారణ.. స్థానికుల్లో భయాందోళన

పులి అడుగుజాడలు


కడియం, సెప్టెంబరు 24: కడియం- వీరవరం రోడ్డులో జీఎస్ఆర్ ఫంక్షన్‌హాలు వెనుక ఓ పొలంలో మంగళవారం చిరుతపులి సంచారం చేస్తుందనే వార్త కడియం మండల ప్రజలను భయాందోళనలకు గురిచేసింది. జీఎస్ఆర్ వెనుక ఉన్న నర్సరీలో కడియపులంకకు చెందిన మధు అనే రైతు పులినిచూసి భయాందోళనలకు గురి అవ్వడంతో పాటు పరుగులు తీసాడు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందడంతో అటవీశాఖ జిల్లా అధికారి భరణి ఆదేశాల మేరకు హుటాహుటిన అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అవి చిరుతపుల్లి పాదముద్రలుగా నిర్ధారించారు. కదలికలను పరిశీలిస్తున్నారు. విషయం బయటకు రావడంతో అటవీశాఖ అధికారులు కడియం చేరుకున్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా వెళ్లాలని, రాత్రి సమయంలో బయటకు రావద్దని చెబుతున్నారు. కడియపులంక గ్రామం లో దోసాలమ్మకాలనీ ప్రజలు భయంతో వణికిపోతున్నారు. టార్చ్‌లైట్లు పట్టుకుని కేకలు వేసుకుంటూ తిరుగుతున్నారు. నర్సరీ కార్మికులు ఎవరూ బుధవారం పనుల్లోకి రావద్దని సెలవు ప్రకటించినట్లు నర్సరీరైతులు చెబుతున్నారు. మొక్కల ఎగుమతులతోపాటు నర్సరీల్లో ఎటువంటి పనులు ఉండవని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రి సమయంలో ఒంటరిగా రాకూడదని చిన్నపిల్లలను బయటకు తీసుకు రావద్దు అని, ఇంటి ఆరు బయట లైట్లు వేసుకుని ఉంచాలని హెచ్చరిస్తున్నారు. ప్రతీ ఆలయంవద్ద మైకులు సౌండ్ పెట్టాలని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. నర్సరీ ప్రాంతం కావడంతో ఏ మొక్కల మధ్య పులి ఉందో? అని నర్సరీ రైతులు, కార్మికులు భయంతో వణికిపోతున్నారు.

● దివాన్ చెరువులో మూడు రోజులుగా జాడ లేదు

దివాన్‌చెరువు ప్రాంతంలో మూడు రోజులుగా చిరుత జాడ లేకపోవడం, మంగళవారం రాత్రి నర్సరీ ప్రాంతంలో కనిపించడం అటవీశాఖ అధికారులు పులి జాడలే అని నిర్ధారించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పులి ఈ ప్రాంతం నుంచి ఎక్కడికి వెళ్లిందనేది అంతు పట్టడం లేదు. నర్సరీలో సీసీ కేమేరాలు ఉంటాయి. రైతులు నర్సరీల్లో ఉండటానికి సాహసించడం లేదు. గంటకు 100 కిలోమీటర్ల వేగం కంటే ఎక్కువగా పయనించే ఈ చిరుత నర్సరీల్లో ఉందా ? అక్కడి నుంచి సమీపంలో ఉన్న మండపేట, ఆలమూరు మండలాల వైపు వెళ్లిందా? లేక కడియంలోనే ఉందా ? అనేది చర్చాంశనీయంగా మారింది.

రెవెన్యూ వర్సెస్ ఫారెస్టు

- చూచిరేవుల భూముల్లో ఇరుశాఖల మధ్య వివాదం
- రిజర్వు ఫారెస్టులో కార్పొరేట్ వ్యవసాయం కుదరదంటూ వ్యవసాయ పనులను అడ్డుకున్న అటవీశాఖాధికారులు
- అవి రెవెన్యూ భూములంటూ రెవెన్యూ అధికారుల వాదన


అడవిలో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, ఫారెస్టు అధికారులు

కూనవరం, సెప్టెంబరు 24: అల్లూరిజిల్లా కూనవరం మండలంలోని పైడిగూడెం పరిధిలో చూచిరేవుల గ్రామానికి చెందిన గిరిజనులకు ప్రభుత్వం కొంత భూమి ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన గిరిజన భూమి ఇప్పుడు రెవెన్యూ, అటవీ శాఖాధికారుల మధ్య వివాదంగా మారింది. ఈ భూములు మావంటే మావంటూ మంగళవారం ఆ ఇరు శాఖల అధికారులు సర్వే నిర్వహించుకున్నారు. మండల పరిధిలో చూచిరేవుల గ్రామస్తులకు ప్రభుత్వం సుమారు 200 ఎకరాలకుపైగా భూమిని గతంలో వారికి ఇచ్చినట్లు గిరిజనులు చెబుతున్నారు. ఆ భూములు తమవంటూ ఫారెస్టు అధికారులు రంగంలోకి దిగడంతో గిరిజనులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. 1970 నుంచి ఇప్పటివరకు చూచిరేవుల గిరిజనులు సజావుగానే వ్యవసాయం చేసుకుంటున్నారు. కౌలు పేరుతో వలస రైతులు ఆ భూముల్లోకి అడుగుపెట్టడంతో ఆ భూములు ఇప్పుడు ప్రస్తుతం వివాదంగా మారాయి. ఈ భూములు కంపార్టుమెంట్ 167 రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉన్నాయని ఈ భూముల్లో కార్పొరేట్ వ్యవసాయం కుదరదని అక్కడ జరుగుతున్న వ్యవసాయ పనులు అటవీశాఖాధికారులు అడ్డుకున్నారు. ఆదేశాలు వచ్చేవరకు ఈ భూముల్లో వ్యవసాయం నిర్వహించవద్దన్నారు. దీంతో భూ యజమానులైన గిరిజనులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం అటవీశాఖ, రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే నిర్వహించారు. సర్వే నెం. 123 ప్రకారం ఈ భూములు తమవేనంటూ రెవెన్యూ అధికారులు ఫారెస్టు అధికారులకు తెలియజేశారు. 1984 గెజిట్ ప్రకారం ఈ భూములు తమ రిజర్వు ఫారెస్టు ఆధీనంలో ఉన్నాయని అటవీశాఖాధికారిణి మోహిణి విజయలక్ష్మి అక్కడ రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఇవి మావంటే మావంటూ ఇరు అధికారులు వాదించుకోవడంతో చివరకు ఈసమస్య కొలిక్కిరాలేదు. ఈవిషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను అక్కడే పరిష్కరించుకోవాలని ఇరుశాఖల అధికారులు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తాము ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్న భూమిపై పూర్తి హక్కులు కల్పించాలని చూచిరేవుల గిరిజనులు కోరుతున్నారు. గిరిజనులు స్వతహాగా వ్యవసాయం చేసుకుంటే తమకు అభ్యతరంలేదని అటవీ జంతువులు తిరిగే ఈ ప్రదేశంలో విషపూరిత మందులతో వ్యవసాయం చేస్తే అటవీ జంతువులకు హాని కలిగే ప్రమాదముందని అందుకే కార్పొరేట్ వ్యవసాయం చేయవద్దని చెబుతున్న ట్లు అటవీశాఖాధికారులు చెబుతున్నారు.

ఏజెన్సీ సమాచారం

వంద రోజుల్లో సరికొత్త పాలన

● గ్రామసభలో ఎమ్మెల్యే శిరీషాదేవి

ఎటపాక, సెప్టెంబరు 24 ఎన్డీఏ కూటమి వంద రోజుల్లో సీఎం చంద్రబాబు సారథ్యంలో సరికొత్త పాలనతో ముందు కెళ్తుందని, పేదల సంక్షేమమే ధ్యేయం పనిచేస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. మంగళ వారం నెల్లిపాక, పురుషోత్తపట్నం గ్రామాల్లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. విలీన మండలాల పోలవరం నిర్వాసితులు ప్రతీ ఎటా గోదావరివరదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీరికి శాశ్వత పరిష్కారం చూపాలని, నిర్వాసితుల సమస్యలను ఇటీవల సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.ముంపుకు గురైన ఇళ్లకు నష్టపరిహారం, నిత్యవరాలు, బియ్యం అందించి ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. విజయవాడ తరహాలో విలీన మండలాల్లో కూడా దెబ్బతిన్న ఇళ్లకు రూ 10 వేల నష్టపరిహారం చెల్లించాలని సీఎంను కోరినట్లు పేర్కొన్నారు. నెల్లిపాక పీహెచ్‌సీ 30 పడకలు కలిగిన ఆసుపత్రిలో కేవలం 4 బెడ్లతో రోగులకు సేవలు అందిస్తున్నారని,పూర్తిస్థాయి బెడ్లతో ఈ పీహెచ్‌సీలో మౌలిక సదుపాయా ల కల్పన కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పురుపోత్తపట్నంలో ఎమ్మెల్యే శిరీషాదేవీ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామసభల్లో ప్రజల నుంచి వినతులు ఎమ్మెల్యే స్వీకరించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్, తహసీల్దాం పృధ్వీ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడ మఠం బాస్కర్ టీడీపీ సీనియర్ కిలారి వెంకన్న, నలజాల శ్రీకాంత్‌చౌదరి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టీడీపీ నాయకులు విజ్జగిరి రవితేజ, నెల్లిపాక సర్పంచ్ కొర్సా భద్రమ్మ, కణితిమధు తదితరులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై గ్రామసభలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మిర్యాల శిరీషాదేవి

వరరామచంద్రాపురం, సెప్టెంబరు 24: కూటమి ప్రభుత్వం పరిపాలన చేపట్టి వందరోజులు పూర్తి చేసిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంపై మండలంలో ఎమ్మెల్యే మిర్యాల శిరీషాదేవి ఆధ్వర్యంలో గ్రామ సభలు మంగళవారం నిర్వహించారు. ముందుగా మండలంలోని రామవరం గ్రామ పంచాయతీలో ఈకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు గ్రామంలోని 102 గ్రామాలు పోలవరం ముంపు లో లేవని, వాటినికూడా ముంపులో చేర్చాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వీఆర్‌పురం జూనియర్ కాలేజీ ఆవరణలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్య కమం నిర్వహించారు. ముందుగా జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, టీడీపీ రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరా బొర్ర నరేష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా మా సమస్య పోలవరం ఈఏడాది నెలరోజుల వ్యవధిలో మూడు దఫాలుగా వచ్చిన గోదావరి వరదలకు ప్రజలు తీవ్ర ఇబ్బందుల పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్‌పురం బీసీ కాలనీలోని ముంపులో చేర్చని 98 కుటుంబాలను పోలవరం ముంపులో చేర్చాలని ఎమ్మెల్యేకు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకున్న క్రమంలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్ ఆదేశాల మేరకు ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్బారావు, మాజి జడ్పిటీసి రంపచోడవరం తెలుగు యువత అధ్యక్షుడు మఠం బాస్కర్, ముత్యాల రామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆచంటి శ్రీను, జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకా సమ్మెలోనే వైద్యులు

● సాధారణ వైద్యం నర్సులతోనే కొనసాగింపు

మోతుగూడెం, సెప్టెంబరు 24: జీవో నెం.85ను వ్యతిరేకిస్తూ వైద్యులు ఈ నెల 17 నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం వైరల్ జ్వరా లు విజృంభించడంతో ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. మోతుగూడెం, దబ్బగూడెం పీహెచ్‌సీల్లో స్టాఫ్ నర్సులే సేవలందిస్తున్నారు. అత్యవసర కేసులువస్తే చింతూరు ఏరియా ఆసుపత్రికి పంపిస్తున్నారు. మెరుగైన వైద్యం అందట్లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చట్టిలో వ్యక్తి ఆత్మహత్య

చింతూరు, సెప్టెంబరు 24: అల్లూరిసీతారామరాజు జిల్లా చింతూరు మండలం, చట్టికి చెందిన తుర్రంపెంటయ్య (58) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ శ్రీనివాసరావు కథనంమేరకు చట్టికి చెందిన తుర్రంపెంటయ్య మతి స్థిమితం కోల్పోయాడన్నారు. దీంతో తనను ఎవరో హత్య చేయడానికి వస్తున్నారన్న భ్రమతో కత్తి, విల్లంబులు లాంటి మారణా యుధాలను వెంట బెట్టుకొని తిరగుతుంటాడన్నారు. ఏ ఒక్కరికి హాని తలపెట్టడన్నారు. అవివాహి తుడైన పెంటయ్య సోమవారం అర్ధరాత్రి దాటాక గ్రామంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ట్రాన్స్‌కో ఎటపాక జేఈగా పరుశురాముడు

ఎటపాక, సెప్టెంబరు24 : ఎటపాక విద్యుత్‌శాఖ జేఈగా పరుశురాముడు నియమితులయ్యారు. విద్యుత్‌శాఖ అధికా రుల సాధారణ బదిలీల్లో భాగంగా ఎటపాక మడలానికి పరుశురాం బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ విద్యుత్‌శాఖ జేఈగా పనిచేసిన జి.రాజ్‌కపూర్ కూనవరం మండలంకు బదిలీ అయ్యారు. రాజ్‌కపూర్ ఎటపాకలో ఐదేళ్ల పాటు పనిచేశారు.

ఏజెన్సీలో పర్యాటకుల రక్షణకు చర్యలు : పీవో

రంపచోడవరం, సెప్టెంబరు 24: ఏజెన్సీల పర్యాటక ప్రాంతాలలో ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన సబ్‌కలెక్టర్ కల్పశ్రీతో కలిసి ఏడు మండలాల తహశీల్దార్లు, పర్యాటక, అటవీ, రెవెన్యూ, పంచాయితీరాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలలో పర్యాటకులకు ఏఏ ప్రాంతాలలో రక్షణ కవచాలు ఏర్పాటుచేయాలో గుర్తించి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. శని, ఆదివారాల్లో ఏజెన్సీ పర్యాటకానికి వచ్చే పర్యాటకులకు డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లు నిర్వహించి కేసులు నమోదుచేసి జరిమానా విధించాలని పోలీసుశాఖను ఆదేశించారు. సబ్ కలెక్టరు కల్పశ్రీ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలలో పర్యాటకులు తిలకించే ప్రాంతాలలో ముందుగా జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. పర్యాటక ప్రదేశాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాన్నారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టరు వి.స్వామినాయుడు, సబ్ డీఎఫ్‌వో బి.శ్రీరాములురావు, పర్యాటకశాఖ అసిస్టెంట్ మేనేజరు ఆర్.రంగబాబు, జీఎస్వీ సత్యనారాయణ, సీహెచ్ శ్రీని వాసరావు, డివిజనల్ పంచాయతీ అధికారి అబ్బులు, తహశీల్దార్లు కృష్ణజ్యోతి, సీహెచ్ శ్రీనివాసరావు, సత్యనారాయణ, అనసూయ, సుబ్రహ్మణ్యాచారి, డీటీలు రామకృష్ణ, బాలాజీ, బి.రాజు, పీవోఆర్డి జాన్ విల్సన్, ఎంపీడీవోలు యాదగి రీశ్వరరావు, పి.జయంతి, డీఈలు సాయి సతీష్ పాల్గొన్నారు.

ప్రతీ పథకం ప్రజలకు చేరుతుంది

కూనవరం, సెప్టెంబరు 24: ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతీ పథకం ప్రజలకు చేరుతుందని తహసీల్దార్ నాగబాబు అన్నారు. కూనవరం మేజర్ పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 ధ్యేయంతోనే అందరూ పనిచేయాలన్నారు. రెవెన్యూపరంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వరద బాధితులకు పరిహారంలో ఏఒక్క నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో సురేష్‌కుమార్, ఆర్ఐ సత్యనారాయణ, సర్పంచ్ హేమంత్, వీఆర్వో వెంకన్న ఉన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

చింతూరు, సెప్టెంబరు 24: రైతులు సాంకేతికతను అంది పుచ్చుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు కోరారు. కుమ్మూరు, మామిళ్లగూడెం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. శ్రీనివాసరావు రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి రైతువిధిగా ఇ-పంట నమోదు చేయించుకోవాలన్నారు.

ఇందుకూరుపేటలో పొలం పిలుస్తోంది

దేవీపట్నం, సెప్టెంబరు 24: మండలంలోని ఇందుకూరుపేటలో వ్యవసాయాధికారి ప్రశాంతి ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్‌కేవీ చౌదరి పంటలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంపీడీవో రత్నకుమారి, ఎంపీపీ మరిశెట్ల వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ శిరసం సత్యవేణి, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, కూటమి నాయకులు నగేష్, నాగేశ్వరరావు, త్రిమూర్తులు, హరిశ్చంద్రుడు, గౌరీశ్వరి, ముండ్రు మధుసూదనరావు, జొన్నల శ్రీనివాస్, తాతాజీ, శివరామకృష్ణ, నాగన్నదొర, ఏఈవో ఉమా పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగినపుడే నిజమైన అభివృద్ధి

చింతూరు, సెప్టెంబరు 24: మండలంలోని వరద ప్రభా విత గ్రామాలకు చెందిన మహిళలకు అంధేరిహిల్స్, శిరీష్‌బ్రాండ్ సంస్థల సహకారంతో సాఫిడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మీరాఖాదర్ మంగళవారం సోలార్ లైట్లు, టార్పాలిన్లు, కూరగాయ వంగడాలను ఉచితంగా పంపిణీ చేశారు.

జాతీయ సేవా పథకం దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 24: విద్యార్థులు చిత్తశుద్ధి, క్రమశిక్షణతో సామాజిక సేవలో పాల్గొనేలా చేయడమే జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) ప్రధాన ధ్యేయమని ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎబిల్ రాజబాబు అన్నారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలోని మూడు యూనిట్లతో పట్టణ, పలు గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ పీవో, ప్రిన్సిపాల్ రాజబాబును సిబ్బంది, విద్యార్థులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

▸ రైతులు అధిక దిగుబడులు సాధించాలి
▸ రాజానగరం వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాసరెడ్డి
▸ పలుచోట్ల 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు

రాజానగరం, సెప్టెంబరు 24: ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం నూతనంగా రూపకల్పన చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని పలుచోట్ల మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజానగరం మండలం నందరాడ, నరేంద్రపురం గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనే ఉద్దేశ్యంతో వ్యవసాయ విస్తరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయం, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి పొలంబాట, పంటల సాగుపై చర్చిస్తారన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువచేయడం, వ్యవసాయ, అనుబంధశాఖల పథకాలపై అవగాహన కల్పించడం, క్షేత్రస్థాయి సమస్యలకు తక్షణ పరిష్కారం సూచిస్తారన్నారు. అలాగే తక్కువ పెట్టుబడి, అధిక ఉత్పత్తి, ఎక్కువ నికరాదాయం దిశగా ప్రోత్సహించడం ఈకార్యక్రమం ముఖ్యోద్దేశమని ఏడీఏ చెప్పారు. కార్యక్రమంలో ఏవో షేక్ ఇమామి ఖాసిమ్, ఉద్యానశాఖాధికారి దివ్యశ్రీ, కేవీకే అధికారులు, టెక్నికల్ ఏవో శాంతాఆలివ్, వెటర్నరీ అసిస్టెంట్ పావని, అగ్రికల్చర్ అసిస్టెంట్ పి.ధర్మరాజు ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేటలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అనపర్తి ఏడీఏ డీవీ కృష్ణ విచ్చేసి వరి పొలాలను సందర్శించి, పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వరిలో ఆకుఎండు తెగులును ప్రధానంగా గమనించామని చెప్పి దాని నివారణకు



బిక్కవోలులో పొలం పిలుస్తోంది కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చర్యలను రైతులకు వివరించారు. ఎలుకలు నివారణకు నూకల్లో కలిపిన బ్రోమోడయోలిన్ మందును సరఫరా చేయడం జరిగింది. ఉద్యానశాఖ భాగంగా పామాయిల్ మొక్కలు 100శాతం రాయితీపై, డ్రిప్, స్ప్రింకర్లు సబ్సిడీపై సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. పశుసంవర్ధకశాఖ తరుపున టోటల్ మిక్స్ డ్‌రేషన్, పశుకిసాన్ క్రెడిట్‌కార్డు స్కీమ్‌ను వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, రైతులు ఉండవిల్లి గిరిబాబు, పోతుల చిన్నికాపు, రైతులు, ఉద్యానవన విస్తరణాధికారి అరవింద్ పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో జరిగిన కార్యక్రమంలో ఏవో శామ్యూల్‌జాన్ మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమ ఉద్దేశ్యాన్ని రైతులకు వివరించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. ఎంపీపీ బుద్ధాల కన్నారావు, నాయకులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, సింగారపు రామారావు, గుణ్ణం రమేష్, వెటర్నరీ డాక్టర్ ప్రణీత్, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఈశ్వర్ కుమార్, ఈవో కె.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఊలపల్లిలో జరిగిన కార్యక్రమంలో రైతులకు ఎలుకల నివారణా మందును కూటమి నాయకులు పంపిణీ చేశారు. తొండాపు సురేష్‌కుమార్, బందారు శివ, కాకర్ల అశోక్, ఈవో కె.రామకృష్ణ పాల్గొన్నారు.

కడియం: కడియంలో వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాట్ ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు పంటసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పంటకు పురుగుమందుల తగు మోతాదులో మాత్రమే వినియోగిస్తూ సేంద్రియ ఎరువులను కూడా వినియోగించాలని, వర్మీకంపోస్టుతో పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో చిలుకూరి నాగేశ్వరరావు, గారపాటి తాతబ్బాయి, చిక్కాల ఈశ్వరరావు, గ్రీన్‌లాండ్ బాబి, చిక్కాల శ్రీను, తామెళ్ల అయ్యప్ప, ఉద్యాన అధికారి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.



రాజానగరం: నందరాడ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు

అనపర్తి: అనపర్తి శివారు సావరం, కొత్తూరు గ్రామాల్లో వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ అధికారులు పర్యటించి వరి పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం రెండు చోట్ల రైతు సమావేశాలను నిర్వహించి రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏవో సురేష్‌కుమార్, డాక్టర్ ప్రసన్న, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, నాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, నరేంద్రచౌదరి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని రాజవోలులో జరిగిన కార్యక్రమంలో ఏవో భీమరాజు మాట్లాడుతూ పంట దిగుబడి కారణాలు తెలుసుకుని సూక్ష్మపోషక లోపాలు గుర్తించి తద్వారా భూసారాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ అనుబంద శాఖల పథకాలను పశుసంవర్ధకశాఖ అధికారి వెంకట్రావు, ఉద్యానశాఖ సహాయకురాలు మౌని రైతులకు వివరించారు. రిమ్మలపూడి రామకృష్ణ, జాన్‌పీటర్, దుర్గాబాబు, సంధ్య పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని కూనవరంలో జరిగిన కార్యక్రమంలో ఏవో సూర్యరమేష్ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు ఎలా సాధించాలో రైతులకు చెప్పారు. ప్రస్తుత వరిలో వచ్చిన ఆకు ఎండు తెగులు నివారణ చర్యలను యాజమాన్య పద్ధతులను, ప్రకృతి వ్యవసాయం పురుగుమందుల పిచికారీలో డ్రోన్ల ప్రాముఖ్యతను వివరించారు. పర్యవేక్షణాధికారిగా ఐఏఎల్ ల్యాబ్ ఏవో డి.రామతులసి పంటపొలంలో భూసార పరీక్షలకు మట్టి శాంపిల్స్‌ను ఎలా తీయాలో చెప్పారు.

కోరుకొండ: మండలంలోని నర్సాపురంలో వరి పంటకు జీవామృతాన్ని డ్రోన్ ద్వారా పిచికారీ చేయించి రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటకు వాడాల్సిన ఎరువులు, పురుగుమందులను తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఏ మల్లికార్జునరావు, ఈవో గౌరీదేవి, స్థానిక రైతు భరోసా కేంద్రం ఏఈవో డాల్సా, రైతులు భీమరాజు, సొంగా కృష్ణ, ఎంపీటీసీ పీతా శ్రీను పాల్గొన్నారు.

లడ్డూ వివాదంపై సీబీఐ విచారణ జరిపించాలి

సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకుల నిరసన దీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 24: తిరుమల లడ్డూ ప్రసాదంపై తలెత్తిన వివాదంపై సీబీఐ విచారణ జరిపించాలని లేదా సుప్రీంకోర్టు, హైకోర్టు సిట్టింగ్ జడ్జిలతో విచారణ జరపాలని కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట టీకే విశ్వేశ్వరరెడ్డి, బాలేపల్లి మురళీధర్ నిరసన దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా రుద్రరాజు, విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ తిరుమలలో 2014 నుంచి 2024 వరకూ అనుమతించిన ప్రత్యేక దర్శనాలపై కూడా విచారణ జరిపించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తుపై తమకు నమ్మకం లేదన్నారు. లడ్డూ నాణ్యతపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది శ్రీవారి భక్తుల్లో ఆందోళన నెలకొందని అన్నారు. ఈ వివాదంలో నిజాలు నిగ్గు తేల్చేందుకు కూటమి ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని, నిందితులు ఎవరైనా కఠినంగా శిక్షించాలని కోరుతున్నామన్నారు. తిరుమలతోపాటు రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో అందించే ప్రసాదాల్లో నాణ్యత పాటించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, పీసీసీ సభ్యుడు బోడా వెంకట్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద, నాయకులు చింతాడ వెంకటేశ్వరరావు, కొవ్వూరు నగర అధ్యక్షుడు గంధం బాహుజీ బాబ్జీ, రాజానగరం ఇన్‌ఛార్జి ముండ్రు పెదబాబు, నిడదవోలు నాయకులు చిన్నం మురళీ తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

టీడీపీని మరింత బలోపేతం చేసుకుందాం

▸ పార్టీ విజయానికి కష్టపడిన వారికి గుర్తింపు
▸ సిటీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే వాసు



టీడీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 24: లోటుపాట్లను సరిదిద్దుకుని రాజమహేంద్రవరంలో టీడీపీని మరింతగా బలోపేతం చేసుకుందామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో మంగళవారం టీడీపీ విస్తృత స్థాయి సమావేశం నగర అధ్యక్షుడు రెడ్డి మణి అధ్యక్షతన జరిగింది. దీనికి ఎమ్మెల్యే వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, గన్ని కృష్ణ, యర్రా వేణుగోపాలరాయుడులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ వందేళ్ల తర్వాత ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్, 90 ఏళ్ల తర్వాత జాంపేట కోఆపరేటివ్ బ్యాంక్, 26 ఏళ్ల తర్వాత ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ లను టీడీపీ కూటమి కైవసం చేసుకుందన్నారు. ఇదంతా పార్టీ నాయకులు, కార్యకర్తల ఐక్యత వల్ల సాధ్యమైందన్నారు. పార్టీ విజయం కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. మహిళల భద్రత కోసం మీ భద్రత-మా బాధ్యత కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలను ఆదుకుంటామన్నారు. గన్ని కృష్ణ మాట్లాడుతూ 40 ఏళ్ల పాటు పార్టీ కోసం పని చేశానని, పదవుల కోసం ఎవరి దగ్గర దిజారే స్వభావం తనది కాదన్నారు. అనంతరం 2వ డివిజన్‌కు చెందిన రాయుడు గణేష్ అతని మిత్ర బృందం సుమారు 250 మంది వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వారికి ఎమ్మెల్యే వాసు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, వర్రే శ్రీనివాసరావు, దొండపాటి సత్యంబాబు, మజ్జి రాంబాబు, నక్కా చిట్టిబాబు, కుడుపూడి సత్తిబాబు, చాన్ బాషా, జాంపేట బ్యాంక్ చైర్మన్ బొమ్మన జయకుమార్, తవ్వా రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

▸ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్/కడియం, సెప్టెంబరు 24: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు మంగళవారం పలుచోట్ల జరిగాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట, కడియం మండలం దుళ్ల గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే గోరంట్ల ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలు హర్షించే విధంగా పాలన అందిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతోందన్నారు. కాగా సచివాలయ సిబ్బంది ఆఫీస్‌కు మాత్రమే పరిమితమవుతున్నారని, క్షేత్రస్థాయిలో పర్యటించాలని గ్రామంలో జరుగుతున్న పారిశుధ్యంపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ఆక్రమణలు తొలగిస్తామన్నారు. రోడ్లు, డ్రైన్లు పనులకు అంచనాలు సిద్ధం చేశామని త్వరలో ప్రారంభిస్తామన్నారు. దుళ్లలో మహిళా సంఘాలకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, దుద్దుపూడి రామకృష్ణ, బొప్పన నానాజీ, పెండ్యాల రామకృష్ణ, దుళ్లలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్,



హుకుంపేట కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

ప్రత్తిపాటి రామారావుచౌదరి, చిట్టూరి అమ్మిరాజు, ముద్రగడ జమీ, వెలుగుబంటి నాని, గుర్రపు సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండలో పలువురు కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు అందజేశారు. 100 రోజుల పాలనలో ప్రభుత్వం చేపట్టిన, త్వరలో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో మైరెడ్డి రాంబాబు, సుంకర శ్రీనివాస్, మాతా ప్రభు, పరస శ్రీనివాసు, బదిరెడ్డి దొర, పత్తారి నరసింహమూర్తి పాల్గొన్నారు.

జనసైనికుల సేవా కార్యక్రమాలు



రక్తదానం చేస్తున్న జనసైనికులు

కడియం, సెప్టెంబరు 24: మండలంలోని బుర్రిలంక గ్రామానికి చెందిన జనసైనికులు మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. రాజమహేంద్రవరం విజయశ్రీ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ప్రియదర్శిని ప్రత్యేక అవసరాల చిన్నారుల పాఠశాలలో విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కడియం సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా జనసైనికులు మాట్లాడుతూ జనసేన రాష్ట్ర కార్యదర్శి రత్నం అయ్యప్ప పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాలు చేశామని తెలిపారు.

యువత సన్మార్గంలో నడవాలి

సీతానగరం, సెప్టెంబరు 24: యువత సన్మార్గంలో నడవాలని సినీ దర్శకుడు, నటుడు యనమదల కాశీ విశ్వనాథ్ అన్నారు. రఘుదేవపురంలోని చెరువుగట్టు సమీపంలో గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అన్నసమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత ముందుకు వచ్చి గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసి వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. దైవ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా యువత సన్మార్గంలో నడిచే అవకాశం ఉంటుందన్నారు.

రంగంపేట పీహెచ్‌సీ తనిఖీ

రికార్డుల పరిశీలన.. ముకుందవరంలో పర్యటన

రంగంపేట, సెప్టెంబరు 24: రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాజమహేంద్రవరం డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయం నుంచి జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ మంగళవారం తనిఖీ చేసింది. ఏఎన్ఎంల దగ్గర ఉన్న అన్ని రికార్డులను పరిశీలించారు. అలాగే ఆన్‌లైన్ రిపోర్టింగ్‌కు, ఏఎన్ఎం దగ్గర ఉన్న రికార్డులకు సరిపోయిందో లేదో చెక్ చేశారు. అనంతరం ముకుందవరం గ్రామంలో పర్యటించి గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అందుతున్న వైద్య సేవలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. కాగా గ్రామంలోని గర్భిణుల, బాలింతలు, శిశువుల నమోదు, టీకాల తేదీల విషయంలో ఏఎన్ఎం, ఆశావర్కర్లకు మధ్య తేడాలను గుర్తించారు. ఇటువంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు డీపీహెచ్ఎన్‌వో వసంతలక్ష్మీ, సీహెచ్ బాస్కర్, సంధ్యారాణి, రామకృష్ణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుకు ధన్యవాదాలు: ముప్పాళ్ల

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థ, న్యాయవాదుల సంక్షేమం పట్ల సీఎం చంద్రబాబు నిబద్ధతకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు అన్నారు. అమరావతిలో వందెకరాల్లో అంతర్జాతీయ న్యాయ కళాశాల, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు, జూనియర్ న్యాయవాదులకు రూ.10వేల స్టయిఫండ్ ఇవ్వడానికి, జూనియర్ న్యాయవాదుల శిక్షణకు అకాడమీ ఏర్పాటుకు అధికారులను ఆదేశించడం న్యాయవ్యవస్థ అభ్యున్నతికి దోహదపడడమేనని ముప్పాళ్ల అన్నారు.

కనకదుర్గమ్మ స్వర్ణ కిరీటానికి గ్రామోత్సవం

గోకవరం, సెప్టెంబరు 24: గోకవరంలోని దేవిచౌక్ సెంటర్‌లోని శ్రీకనకదుర్గమ్మకు సుమారు రూ.21 లక్షలతో రూపొందించిన నవరత్న ఖచిత సువర్ణ కిరీటానికి మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అందించిన రూ.14 లక్షలు, భక్తుల నుంచి సేకరించిన విరాళాలు రూ.7లక్షలతో ఈ కిరీటాన్ని అతి సుందరంగా రూపొందించారు. రంబాల శ్రీనివాసరావు, గంగారత్నం దంపతులు కిరీటాన్ని శిరస్సుపై పెట్టుకొని గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. మూడు రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కిరీటాన్ని ఊరేగించిన అనంతరం అక్టోబరు 4న అమ్మవారికి అలంకరించనున్నారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు తామర్ల రాంబాబు, మామిడి అయప్ప, దాసరి తమ్మన్నదొర, వరసాల ప్రసాద్, ఇనగోటి బాపన్నదొర, వల్లూరి జగన్నాధరావుశర్మ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో పాలన అస్తవ్యస్తం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 24: వైసీపీ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులు వేధింపులకు గురయ్యారని అందుకే పాలన అస్తవ్యస్తంగా మారిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం విజయవాడ బీజేపీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక వారధి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖలో పాడేరు డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసిన వెంకటస్వామి తన గోడును వెళ్లబోసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం తనను అనేక ఇబ్బందులకు గురి చేసిందని పది నెలలుగా జీతం కూడా రాకుండా చేశారన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నవంబర్ నెలలో పదవీ విరమణ చేయనున్న ఆయనకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని మహిళలు వరదల వల్ల నష్టపోయామని తమకు సత్వర సహాయం అందించాలంటూ వినతిపత్రం అంజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్‌డీ విల్సన్ పాల్గొన్నారు.

వరద బాధితులకు 'గాయత్రి' దాతృత్వం

రాజానగరం, సెప్టెంబరు 24: విజయవాడ వరద బాధితులకు రూ.4 లక్షలు విలువైన నిత్యావసర సరుకులను అందజేసి కానవరంలోని గాయత్రి విద్యా సంస్థలు దాతృత్వాన్ని చాటుకున్నాయి. కానవరం, కోరుకొండ బ్రాంచ్‌లలోని విద్యార్థులు, అధ్యాపక బృందం కలిసి కరస్పాండెంట్ వీవీవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో విజయవాడలో ముంపు బారినపడ్డ 500 కుటుంబాలకు నిత్యావసర సరుకులను ప్యాకెట్లు రూపంలో అందజేశారు.

నదులే నాగరికతకు నిలయాలు

బిక్కవోలు, సెప్టెంబరు 24: నదులే నాగరికతకు నిలయాలని హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్ విద్యార్థులకు తెలిపారు. కొంకుదురు ఉన్నత పాఠశాల మంగళవారం ప్రపంచ నదుల దినోత్సవాన్ని నిర్వహించారు. సోషల్ ఉపాధ్యాయుడు మేడపాటి లక్ష్మణరెడ్డి ఇంటరాక్టివ్ ఫ్లాట్ పేనల్ ద్వారా దేశంలోని వివిధ నదులు వాటి జన్మస్థలాలు, వాటి వల్ల మానవాళికి కలిగే ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోకవరంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

గోకవరం, సెప్టెంబరు 24: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈఏడాది మార్చి 31వరకు చేపట్టిన పనులపై మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన జరిగిన ఈ తనిఖీలో మస్తర్ల కొట్టివేతలు, దిద్దుబాట్లుపై రూ.14,500 జరిమానా, కొలతల్లో వ్యత్యాసాలకు రూ.28,600 జరిమానా, మొక్కలు పెంపకంలో భాగంగా వేసిన మొక్కలు తక్కువ ఉండడం, చెరువు గట్లుపై సెక్షనింగ్ సక్రమంగా చేయకపోవుటకు రూ.62,450 జరిమానా విధించినట్టు డ్వామా సహాయ పథక సంచాలకుడు బి.రాం ప్రసాద్ తెలిపారు. బినామీ మస్తర్ల కింద రూ.58,320, మినీగోకులంలో రూ.64,258, పంచాయతీరాజ్ పనుల్లో భాగంగా భవనాలు, సీసీ రోడ్లలో వ్యత్యాసాలకు రూ.1,58,225ను సంబంధిత బాధ్యుల నుంచి రికవరీ చేయ నున్నట్టు రాంప్రసాద్‌తో పాటు ఏపీవో అప్పలరాజు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

కడియంలో చిరుత



రాజమహేంద్రవరం రిజర్వు ఫారెస్ట్‌లో గత నాలుగు రోజులుగా జాడలేని చిరుత పులి మంగళవారం రాత్రి కడియంలో ప్రత్యక్షమైంది. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు..

6

తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ల బదిలీలు

రాజమహేంద్రవరంసిటీ/ రూరల్, సెప్టెంబరు 24 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులు బదిలీలు నిర్వహించారు. ఈ మేరకు తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్ల పోస్టింగ్‌లకు ఉత్తర్వులు జారీ చేశా మని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.

బదిలీ అయిన తహశీల్దార్లు


పశ్చిమగోదావరి జిల్లా భీమవరం తహశీల్దార్ సీహెచ్.విద్యావతి బదిలీపై కొవ్వూరు (కేఆర్ఆర్‌సీ) సబ్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. రాజమహేంద్రవరం రూరల్ మండల తహశీల్దార్‌గా అల్లూరి జిల్లా పాడేరు తహశీల్దార్ సిహెచ్.శ్రీనివాస్‌ను నియమించారు. ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడ తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్‌ను కొవ్వూరు తహశీల్దార్‌గా బదిలీ చేశారు. జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారి వీహెచ్‌జీఆర్.పాపారావును రాజమహేంద్రవరం అర్బన్‌కు బదిలీ చేశారు. జిల్లా కలెక్టరేట్ భూములు విభాగం సూపరింటెండెంట్ ఎండి మక్బూద్ ఆలీని ఏవోగా బదిలీ చేశారు.

డిప్యూటీ తహశీల్దార్ల బదిలీలు

తొండంగి డిప్యూటీ తహశీల్దార్ ఎం.అఖిలను ఈనాం డీటీ రాజమహేంద్రవరం ఆర్‌డీవో కార్యాలయం, శంఖవరం డీటీ ఎం.కార్తికేయను రాజమహేంద్రవరం ప్రత్యేక డిప్యూటీ తహశీల్దార్, ఎన్నికల డీటీ జీడీ మల్లేశ్వరి రాజమహేంద్రవరం అర్బన్ సీఎస్‌డీటీగా నియమించారు. రంగంపేట డీటీ టీవీవీఎస్‌ఏ శశిధర్ ప్రత్యేక డీటీ స్పెషల్ కలెక్టర్ (ఎల్ఎ) రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్ డీటీగా వీఆర్‌పురం నుంచి ఎస్.సుబ్బారావు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు డీటీగా పనిచేస్తున్న జీఎస్ లక్ష్మి రమ్యను సీఎస్‌డిటీగా జిల్లాకు బదిలీ చేసారు. కడియం డీటీ ఎం.కృష్ణ సుధీర్‌ను రాజమహేంద్రవరం వీఐపీ స్పెషల్ కలెక్టర్ (ఎల్ఎ) ప్రత్యేక డీటీగా బదిలీ చేశారు. స్పెషల్ డీటీ బీవీకే శాస్త్రిని జిల్లా డీసీఎస్‌వోకు బదిలీ చేశారు. రాజమహేంద్రవరం ఆర్‌డీవో కార్యాలయం ఈనాం డీటీ ఎన్‌వీజీ.శేఖర్ ప్రత్యేక డీటీ రాజమహేంద్రవరం, వై.రామవరం డీటీ కె.సుధాకరరావును రాజానగరం డీటీగా బదిలీ చేశారు. ప్రాజెక్టు స్పెషల్ డీటీ యు.రంజిత్ కుమార్‌ను రంగంపేట డీటీగా బదిలీ చేశారు. రంగపేట డీటీ ఎం.సునీతను సీతానగరం బదిలీ చేశారు. రాజమహేంద్రవరం స్పెషల్ డీటీ ఎంవీ.సాయి ప్రసాద్‌ను గోకవరం డీటీగా, రాజమహేంద్రవరం అర్బన్ డీటీ డి.సాయి రామ్ కోరుకొండ డీటీగా బదిలీ అయ్యారు. అనపర్తి మండలం ఎన్నికల డీటీ జి.మహాలక్ష్మి కడియం డీటీగా, రంపచోడవరం డీటీ ఎస్‌వీవీ.సత్యనారాయణ అనపర్తి ఎన్నికల డీటీగా బదిలీ చేశారు. జిల్లా సీఎస్‌డీటీ వి.శ్రీనివాసరావును రాజమహేంద్రవరం అర్బన్, రంపచోడవరం గిరిజన సంక్షేమ స్పెషల్ డీటీ కె.చైతన్య బాబును రూరల్ ఎన్నికల డీటీగా బదిలీ చేశారు. సీతానగరం డీటీ పి.సర్వేశ్వరమూర్తి అదే మండల రీసర్వే డీటీగా, రాజమహేంద్రవరం ఎన్నికల డీటీ ఎ.కుమారిని రాజానగరం డీటీగా బదిలీ చేశారు. రాజమహేంద్రవరం రూరల్ రీసర్వే డీటీ వి.రత్నసాగర్ ను గోకవరం రీసర్వే డీటీ, గోకవరం మండల రీసర్వే డీటీ ఎ.రజనీ కోరుకొండ డీటీగా బదిలీ అయ్యారు. రాజమహేంద్రవరం గెయిల్ డీటీ ఎం.సునీల్ కుమార్‌ను కడియం రీసర్వే డీటీగా బదిలీ చేశారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో జిల్లా సీఎస్‌డీటీ ఐ.సత్యనారాయణను డివిజన్ ప్రత్యేక డీటీ, ఉండి మండలం డీటీ ఎస్‌వీఎస్.నాయుడును కొవ్వూరు డీటీగా బదిలీ చేశారు. ఏలూరు జిల్లా సీఎస్‌డిటీ డీటీ శ్రీనివాసరావును చాగల్లు డీటీగా బదిలీ చేశారు. పెరవలి డీటీ ఎ.కనకదుర్గను ఉండ్రాజవరం డీటీగా, ఉండ్రాజవరం డీటీ కె.పద్మావతిని పెరవలి డీటీగా బదిలీ చేశారు. కొవ్వూరు డీటీ కె.అజయ్‌బాబును గోపాలపురం డీటీగా బదిలీ చేసారు. రాజమహేంద్రవరం స్పెషల్ డీటీ వి.శాంతిప్రియ నల్లజర్ల డీటీగా బదిలీ చేశారు. చాగల్లు డీటీ కె.నిరంజన్ కొవ్వూరు డీటీ ు, పోలవరం డీటీ ఎస్.ప్రసాదరావును నిడదవోలు డీటీగా బదిలీ చేశారు. చాగల్లు రీసర్వే డీటీ కె . ఆనంద్‌కుమార్‌ను కొవ్వూరు రీసర్వే డీటీ, కొవ్వూరు ఎన్నికల డీటీ ఎం.కమల సుందర్ చాగల్లు రీసర్వే డీటీగా బదిలీచేశారు. గోపాలపురం డీటీ బి.ప్రదీప్ కుమార్‌ను నిడదవోలు రీసర్వే డీటీగా, కొవ్వూరు రీసర్వే డీటీ పివీ సాంబశివరావును రీసర్వే గోపాలపురం డీటీగా బదిలీ చేశారు.

పదవులు వరించెన్..

మొదలైన కార్పొరేషన్ పదవుల పందేరం



- ఒక చైర్మన్, 12 బోర్డు మెంబర్లు
- కూటమి పార్టీల శ్రేణుల్లో ఉత్సాహం
- పదవులు దక్కిన వారిలో సంతోషం
- ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కార్పొరేషన్ పదవుల పందేరం మొదలైంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీల నాయకులకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ఆయా పదవులకు ఎంపిక చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. ముఖ్యంగా వర్గాల సమీకరణలను ప్రధానంగా పరిగణలోకి తీసుకున్నట్టు తొలి జాబితా స్పష్టం చేస్తోంది. కార్పొరేషన్ పదవుల జాబితా వెల్లడితో మంగళవారం ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎక్కడ చూసినా ఇదే చర్చ. ఈ పదవుల కోసం ఎదురుచూస్తున్న వారిలోనూ టెన్షన్ పెరిగింది. తాము ఆశిస్తున్న పదవులు దక్కుతాయో లేదోనన్న ఆందోళన కనిపిస్తోంది. ఇక తొలి జాబితాలో చోటు దక్కించుకున్న వారిలో సంతోషానికి అవధులు లేవు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కేడర్‌లలో ఈ పదవుల పంపకం కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఒకే ఒక్క కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. కాకినాడ నగరానికి చెందిన జనసేన నాయకుడు తోట మెహర్ సీతారామ సుధీర్‌ను రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ పదవి వరించింది. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా ఈ సంస్థ చైర్మన్‌గా కాకినాడకు చెందిన మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి తండ్రి భాస్కరరెడ్డి కొనసాగారు. దీంతో మళ్లీ అదే సంస్థ చైర్మన్ పదవి కాకినాడకు దక్కినట్టయింది. ఇక ప్రకటించిన వివిధ కార్పొరేషన్లకు సంబంధించి మొత్తం 13 మంది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు బోర్డు మెంబర్లుగా నియమితులయ్యారు. ఇందులో కాకినాడ జిల్లాకు నలుగురు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన నలుగురు, తూర్పు గోదావరి జిల్లా నుంచి ఐదుగురు ఉన్నారు. నామినేటెడ్ పోస్టుల పందేరానికి తెరదీయడంతో మిగిలిన ఆశావహులు తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు.

పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా సుధీర్

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా జనసేనకు చెందిన తోట సుధీర్‌ను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కసరత్తు చేసి సమర్థుడినే ఎంపిక చేసిందని చెప్పాలి. వృత్తిరీత్యా న్యాయవాది అయిన తోట సుధీర్ గతంలో టీడీపీ లీగల్ సెల్ విభాగంలో సుదీర్ఘ కాలం పనిచేశారు.ఈయన ప్రస్తుతం జనసేన కాకినాడ సిటీ నియోజకవర్గ అధ్యక్షుడిగా, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే కాకినాడ టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్, గాంధీ సెంటినరీ కాలేజీల ప్రెసిడెంట్‌గా ఉన్నారు. వ్యాపార రీత్యా పలు పెట్రోల్ బంకులు, లారీలు ఉన్నాయి. ఈయన తండ్రి గతంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఎస్‌ఈగా పని చేశారు. సుధీర్ న్యాయవాది అయినా వ్యవసాయం అంటే మక్కువ. ఈయన భార్య వైద్యురాలు. కూతురు వైద్య విద్య చదివి ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. తోట సుధీర్ అల్లుడు పవన్ కల్యాణ్ వ్యక్తిగత వైద్యుడు. దీంతో పవన్‌తో సుధీర్‌కు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. కాకినాడ జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్..తోట సుధీర్ అల్లుడికి సొంత సోదరుడు. అల్లుడి ద్వారా పవన్‌తో సత్సంబంధాలు ఏర్పడడంతో సుధీర్ గతేడాది జూన్‌లో పవన్ సమక్షంలో భీమవరంలో జనసేనలో చేరారు. అప్పటి నుంచి కాకినాడ సిటీ నియోజకవర్గ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.



బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెడతా..

కాకినాడ పోర్టు నుంచి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కాకుండా ఉక్కుపాదం మోపుతా. నాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన డిప్యూటీ సీఎం పవన్, సీఎం చంద్రబాబు, మంత్రి మనోహర్‌కి కృతజ్ఞతలు తెలుపుతున్నా. రేషన్ బియ్యం కేవలం పేదలకే చెందే విధంగా చర్యలు తీసుకుంటా.రాష్ట్రవ్యాప్తంగా బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటా.

కాకినాడ జిల్లా నుంచి నలుగురు..



కడలి ఈశ్వరి



తుమ్మల పద్మజ



సత్యనారాయణ



జయకృష్ణ

కలెక్టరేట్ (కాకినాడ)/పెద్దాపురం/గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 24: కాకినాడ జిల్లాలో నలుగురు వివిధ కార్పొరేషన్ల బోర్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. కాకినాడ రమణయ్యపేటకు చెందిన జనసేన నాయకురాలు కడలి ఈశ్వరి, పెద్దాపురం మండలం పులిమేరు గ్రామానికి చెందిన బీజేపీ నాయకురాలు తుమ్మల పద్మజ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ బోర్డు సభ్యులుగా నియమితులయ్యారు. రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన బేతా సత్యనారాయణ(టీడీపీ), చేబ్రోలు గ్రామానికి చెందిన సూరిశెట్టి జయ నాగకృష్ణ (జయకృష్ణ) (జనసేన)లను నియమించారు.

'తూర్పు'న నలుగురికి...



వేణుగోపాలరాయుడు



వి.రాంబాబు



స్వరూపదేవి



హరికిశోర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 24: స్టేట్ కార్పొరేషన్ కమిటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన నలుగురు కూటమి నాయకులకు స్థానం లభించింది. రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ సీనియర్ నేత యర్రా వేణుగోపాలరాయుడును ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ మెంబరుగా నియమించారు. ఆయన గతంలో శాప్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఏపీ టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా మాజీ డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు, జనసేన నాయకురాలు గంటా స్వరూపదేవి నియమితులయ్యారు. పద్మశాలి వెల్ఫేర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యుడుగా రాజమహేంద్రవరానికి చెందిన మాజీ కార్పొరేటర్ టిహరికిషోర్ (బాబి)ను నియమించారు.

కోనసీమలో నలుగురికి..



చిల్లా జగదీశ్వరి



నరసింహారావు



నాగేశ్వరరావు



ఆనందసాగర్

అమలాపురం/ముమ్మిడివరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాకు చెందిన నలుగురిని రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లలో మెంబర్లుగా నియమించింది. అమలాపురానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలు చిల్లా జగదీశ్వరిని ఏపీ స్టేట్ సీడ్స్ కార్పొరేషన్‌కు డైరెక్టర్‌గా నియమించారు. కాట్రేనికోనకు చెందిన మత్స్యకార నేత నాగిడి నాగేశ్వరరావును ఏపీ స్టేట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్‌కు డైరెక్టర్‌గా నియమించారు. టీడీపీ అధికార ప్రతినిధి మోకా ఆనంద్‌సాగర్‌ను సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. మలికిపురానికి చెందిన జనసేన నాయకుడు గుండుబోగుల నరసింహారావును ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమించింది. టీడీపీ నాయకుడు నాగిడి నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు పార్టీ అధిష్ఠానం కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ డైరెక్టర్ పదవి కేటాయించడం సరికాదన్నారు. తనకు ఈ పదవిని స్వీకరించడం ఇష్టం లేదని, పార్టీ పునరాలోచన చేయాలని కోరారు.



'పొలం పిలుస్తోంది' పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

రైతుల సమస్యలు తీర్చడానికే 'పొలం పిలుస్తోంది'

రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్

పెరవలి, సెప్టెంబరు 24 : రైతుల సమస్యలు తీర్చడానికి కూటమి ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని చేపడుతుందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పెరవలి మండలం కాకరపర్రులో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. లాభసాటి వ్యవసాయంపై వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు రైతులను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ ప్రతి మండలంలో వారానికి నాలుగు గ్రామాలు చొప్పున మంగళవారం, బుధవారం రైతులతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రోన్‌తో పంటలపై పురుగు మందుల పిచికారి విధానాన్ని మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే శేషారావు, ఇతర అధికారులు పరిశీలించారు. అనంతరం యంత్ర పరికరాలు ప్రకృతి వ్యవసాయ సంబంధిత రసాయనాలు మొదలైనవి పరిశీలించారు.కార్యక్రమంలో ఉద్యాన అధికారి సుజాత కుమారి,ఏరువాక కోఆర్డినేటర్ నరసింహరావు,అగ్రికల్చర్ ఏడీఈ చంద్రశేఖర్, ఏవో మేరీ కిరణ్,ఉద్యాన అధికారి శ్రీనివాస్,శాస్త్రవేత్త రవీంద్ర కుమా ర్,నాయకులు అతికాల శ్రీను,పిప్పర రవి,పెన్మెత్స సుబ్రహ్మణ్య వర్మ, ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి, ఎంపీటీసీ గుడాల రంగారావు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు బంగారు కిరీటం



గోకవరం దేవీచౌక్ సెంటర్‌లో కనకదుర్గమ్మకు భక్తులు రూ.21 లక్షలతో బంగారు కిరీటం చేయించారు. గ్రామానికి చెందిన కంబాల శ్రీనివాసరావు రూ.14 లక్షలు..భక్తులు రూ.7లక్షలు మొత్తం రూ.21 లక్షలతో బంగారు కిరీటం చేయించారు. ఈ కిరీటంతో భక్తులు మంగళవారం గ్రామోత్సవం నిర్వ హించారు. వచ్చే నెల 4న అమ్మవారికి కిరీటాన్ని అలంకరింపజేస్తారు. - గోకవరం



ఇస్సాగో పరిశ్రమ యాజమాన్యంతో గొడవ పడుతున్న గ్రామస్థులు

ఆ పరిశ్రమ వద్దు!

- అస్సాగో ఇథనాల్ పరిశ్రమను తొలగించాలి
- పరిశ్రమ నుంచి వచ్చే వాసన భరించలేకపోతున్నాం
- కంపెనీ యాజన్యంపై మండిపడిన గ్రామస్థులు

గోకవరం,సెప్టెంబరు 24 : ఆ పరిశ్రమ మా ఊరిలో వద్దు.. వెంటనే తీసివేయాలని గుమ్మళ్ళదొడ్డి గ్రామస్తులు డిమాండ్ చేశారు. గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నుంచి వచ్చే దుర్వాసన భరించలేక ఈ నెల 22వ తేదీన స్థానికులు పరిశ్రమ ముందు ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో పరిశ్రమ యాజమాన్యం మంగళవారం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలోని రామాలయం వద్ద బాధిత గ్రామాల ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశం రచ్చరచ్చగా మారింది. గ్రామస్తులంతా పరిశ్రమ యాజమాన్యాన్ని నిలదీశారు. పరిశ్రమ నుంచి విడుదలయ్యే దుర్వాసన తట్టుకోలేకపోతున్నామని, భారీ శబ్దాల కారణంగా రాత్రిపూట నిద్ర ఉండడం లేదని, చిన్న పిల్లలు హడలెత్తిపోతు న్నారన్నారు. పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థపు నీటిని ఏవిధంగా బయటకు తరలిస్తున్నారో వివరణ ఇవ్వాలన్నారు. మా ప్రాణాలు ప్రమాదబారిన పడకుండా ఏయే జాగ్రత్తలు తీసుకున్నారో వివరించాలంటూ పట్టుబట్టారు. యాజమాన్యం నుంచి సరైన సమాధానం కరువైంది.ఎవ్వరు భయపడవద్దని నిజంగా తమ పరిశ్రమ వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తితే పరిశ్రమలో అంబులెన్స్ సిద్ధంగా ఉంచి ఆ వాహనంలో బాధితులను ఆసుపత్రిలో చేర్పిస్తామని సమాధానం ఇవ్వడంతో స్థానికుల్లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాయి.మీ పరిశ్రమ వల్ల మేము అనారోగ్యం పాలవ్వాలా, పైగా మీ అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తారా అంటూ మండిపడ్డారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం అక్కడినుంచి వెళ్ళిపోయింది.సమావేశంలో గుమ్మళ్ళదొడ్డి,అచ్చుతాపురం,బావాజీపేట, వెదురుపాక గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో భాగంగా జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లకు ప్రభుత్వం స్థాన చలనం కల్పించింది. దీనిపై ఉత్తర్వులు వెలువడాల్సి ఉండగా, కాల పరిమితితో సంబంధం లేకుండా బదిలీలు చేశారు. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లు ఆయా స్థానాల్లో నియమితులై సుమారు రెండేళ్లు మాత్రమే దాటింది. సాధారణంగా సబ్ రిజిస్ట్రార్లను మూడున్నరేళ్లు బదిలీ చేయరు. దీంతో మంచి స్థానాలు 'దక్కించుకున్న' వారు మినహా మిగతా వాళ్లు మనస్తాపం చెందుతున్నారు. రాజమండ్రి, కడియం, రాజానగరం, పిడింగొయ్యి స్థానాలకు 'ధర' ఎక్కువగా పలికిందని ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈసారి యూనియన్ల జోనల్‌స్థాయి నాయకులను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
ఎం.రాజబాబు	రాజమహేంద్రవరం-1	నిడదవోలు
ఆర్.రాంబాబు	ముమ్మిడివరం	రాజమహేంద్రవరం-1
పుల్లంరాజు	వట్లూరు	రాజమహేంద్రవరం-2
సీహెచ్ శ్రీనివాసబాబు	కొత్తపేట	బిక్కవోలు
ఇ.లక్ష్మి	సామర్లకోట	కడియం
కె.కమలప్రియ	రాజమహేంద్రవరం-2	అనపర్తి
త్రినాథ్	కంకిపాడు	పిడింగొయ్యి
వీవీఎస్‌బీ శ్రీనివాస్	భీమడోలు	కోరుకొండ
ఐహెచ్ఆర్‌కే ప్రసాద్	కోరుకొండ	సీతానగరం
కె.సుందరరావు	పిడింగొయ్యి	కొవ్వూరు
మోహన్	కొవ్వూరు	వేగేశ్వరపురం
వి.వెంకటేశ్వర్లు	నిడదవోలు	రాజానగరం
ఇ.వెంకటేశ్వరరావు	కొవ్వూరు	అనంతపల్లి

రైలు కింద పడి వ్యక్తి మృతి

నిడదవోలు, సెప్టెంబరు 24: పట్టణంలోని బసివిరెడ్డిపేట వద్ద ఒకవ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం బసివిరెడ్డిపేటకు చెందిన దడాల సురేష్(40) గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎమ్మెల్యే ముప్పిడికి చెక్కు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

వరద బాధితులకు వాకర్స్ విరాళం

కొవ్వూరు, సెప్టెంబర్ 24: వరద బాధితుల సహాయార్థం కొవ్వూరు శివానంద మహర్షి వాకర్స్ క్లబ్ సభ్యులు రూ.25,000 విరాళం అందజేశారు. మంగళవారం కొవ్వూరు శివానంద మున్సిపల్ పార్క్‌లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పేరాబత్తిని శివప్రసాద్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధికి చెక్కును అందించారు. అనంతరం ఎమ్మెల్యే పార్క్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పార్క్ అభివృద్ధికి మున్సిపల్, ఎమ్మెల్యే నిధులు మంజూరుచేసి సుందరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకష్ణ, సూరపనేని చిన్ని, యాగంటి చలపతి, తాడేపల్లి ప్రబాకర్, పి.రంగాప్రసాద్, అన్నవరం, అంజనేయరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలకు గోష్పాదక్షేత్రం అందంగా ముస్తాబు: గోదావరి పుష్కరాలకు కొవ్వూరు గోష్పాద క్షేత్రాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఉదయం గోష్పాదక్షేత్రాన్ని నాయకులతో కలిసి సందర్శించారు. రావిచెట్టు కొట్టివేసి కొమ్మలు అక్కడే వదిలివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మహిళలు బట్టలు మార్చుకోవడానికి ఏర్పాటుచేసిన రేకుల షెడ్డులు మరమ్మతులు చేపట్టాలన్నారు. రానున్న దసరా, కార్తీకమాసాలకు క్షేత్రానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.



డి.ముప్పవరంలో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ

వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట

నిడదవోలు, సెప్టెంబరు 24: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని మండల వ్యవసాయ శాఖ అధికారి జి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం నిడదవోలు మండలం డి.ముప్పవరం, పందలపర్రు తదితర గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి జి.సత్యనారాయణ మాట్లాడుతూ రైతుల సమస్యలకు పరిష్కారంతోపాటు సాగు పద్ధతులపై రైతుల్లో అవగాహన పెంచడమే దీని ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దేవరపల్లిలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు

దేవరపల్లి, సెప్టెంబరు 24: మండల ప్రజా పరిషత్ నిధుల నుంచి రూ.7కోట్ల 14 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేసినట్లు ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల ప్రజా పరిషత్ పాలకవర్గం మూడేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నందున ఎంపీపీ కేవీకే దుర్గారావు కేక్ కట్ చేశారు. ఎంపీటీసీలు, జడ్పీటీసీ, సర్పంచ్‌లు ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిషత్ అభివృద్ధి పనుల్లో చాలా వరకు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీ.ప్రభాకరరావు, జడ్పీటీసీ పీ.స్వర్ణలత, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ నరహరశెట్టి రాజేంద్రబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

తాళ్లపూడి, సెప్టెంబరు 24: గ్రామ సచివాలయ పోలీస్ సిబ్బంది త్వరలో జరిగే విజయదశమి వేడుకల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తోట రామకృష్ణ అన్నారు. సచివాలయ పోలీస్ సిబ్బందికి తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. దసరా సందర్భంగా అనుమతులు లేకుండా డిజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. ఈ విషయాలపై ప్రజలకు కూడా అవగాహన కలిపించాలని తెలిపారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

గోపాలపురం, సెప్టెంబరు 24: విద్యతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జడ్పీటీసీ కాకులపాటి లలిత అన్నారు. స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ - 14, అండర్ -17 బాలబాలికల పశ్చిమ గోదావరి స్థాయి చపక్‌త్రా ఎంపిక పోటీలు వాదాలకుంట హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీలు జొన్నకూటి మణెమ్మలు రిబ్బన్ కత్తిరించి ఎంపిక ప్రారంభించారు. ఈ ఎంపికలకు జిల్లా పరిధిలోని ఆయా పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇరవై మంది పీఈటీల పర్యవేక్షణలో పోటీలు జరగగా ఎంపికైన విద్యార్థులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా తరఫున అండర్ 14, 17లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. పల్లెల్లోనూ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడానికి సహకరించిన గ్రామస్థులకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ నాగలక్ష్మి, టీడీపీ నాయకులు రమేష్, జ్యేష్ఠ శ్రీనివాసరావు, కాకర్ల శ్రీను, మాజీ సర్పంచ్ కొడమంచిలి విద్యాసాగర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

చాగల్లు, సెప్టెంబరు 24: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సేల్స్‌మేన్‌లు, సూపర్‌వైజర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని మంగళవారం అధికారులకు పలువురు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఐఎంఎల్ డిపో వద్ద వారు కొద్దిసేపు నిరసన తెలిపారు. అనంతం డిపో ఇన్‌చార్జి మేనేజర్ సురేష్, ఎక్సైజ్ సీఐ అంతాక్షరిలను కలిసి వినతిపత్రం అందజేశారు. మద్యం దుకాణాల్లో పనిచేసే సేల్స్‌మన్‌లు, సూపర్‌వైజర్లను కొనసాగించాలని, లేనిపక్షంలో ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కొవ్వూరులో పొలంబడి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబర్ 24: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం వేములూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ రైతులకు అవసరమైన యాంత్రీకరణ పరికరాలను సబ్సిడీపై త్వరలో ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాలలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు మండలంలో పర్యటిస్తారన్నారు. డ్రోన్‌తో మందులు పిచికారి చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, దాయన రామకృష్ణ, మజ్జి శేఖర్, ఇమ్మణి ప్రసాద్, అక్కిన రాంబాబు, మద్దూరు సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, రైతులు, వ్యవసాయ అధికారులు పి.చంద్రశేఖర్, ఎ.గంగాధర్, ఉద్యానవన శాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, వివిధశాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎమ్మెల్యేలు

సేంద్రియ వ్యవసాయంతో లాభాలెన్నో..

నల్లజర్ల, సెప్టెంబరు 24: సేంద్రియ వ్యవసాయంతో ప్రజల ఆరోగ్యం సురక్షితమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. సోమవారం అనంతపల్లి ఎస్‌వీఆర్ కల్యాణ మండపంలో పొలం పిలుస్తోంది నిర్వహించి వివిధ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. ఈ సందర్భంగా త్రీఎఫ్ ఆయిల్‌పాం, వ్యవసాయ, ఉద్యానశాఖతో పాటు వివిధ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వ్యవసాయ ఉత్పత్తులపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో కమల్‌రాజ్, ఉద్యానశాఖ అధికారి భవిత తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

తాళ్లపూడి, సెప్టెంబరు 24: తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం, ప్రక్కిలంక గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళ, బుధవారాలు వ్యవసాయశాఖ, వాటి అనుబంధ శాఖలు గ్రామాల్లో పర్యటిస్తారని ఏవో రుచిత తెలిపారు. కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ సేంద్రియ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు రైతులకు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందిస్తామని అన్నారు. వేగేశ్వరపురం గ్రామంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూటమి నాయకులు కైగాల శ్రీనివాస్, ఇందుగుల రామకృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు. ప్రక్కిలంక గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కూటమి నాయకులు నాయుడు హనుమంతరావు, కందుల బాల నాగేశ్వరరావు, వెటర్నరీ డాక్టర్ బాలాజీ శంకర్, సిబ్బంది, గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



నల్లజర్లలో స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ

చాగల్లు, సెప్టెంబరు 24: పంట నష్టం జరగకుండా ఉండేందుకు రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కే.వేణుగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరంలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లతో పాటు రైతులు పత్తిపాటి వెంకట సుబ్బారావు, గారపాటి శ్రీనివాస్, డి.శ్రీనివాస్, దొమ్మేటి వేణు తదితరులు పాల్గొన్నారు

సాగుపై రైతులకు అవగాహన

గోపాలపురం, సెప్టెంబరు 24: పొలంబడి కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజారావు కోరారు. మండలంలోని భీమోలు, వేలచింతలగూడెం గ్రామాల్లో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

లడ్డూ వివాదంపై సీబీఐ విచారణ జరిపించాలి

సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకుల నిరసన దీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 24: తిరుమల లడ్డూపై తలెత్తిన వివాదంపై సీబీఐ విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట టీకే విశ్వేశ్వరరెడ్డి, బాలేపల్లి మురళీధర్ నిరసన దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా రుద్రరాజు, విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ తిరుమలలో 2014 నుంచి 2024 వరకూ అనుమతించిన ప్రత్యేక దర్శనాలపై కూడా విచారణ జరిపించాలన్నారు. తిరుమలతోపాటు రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో అందించే ప్రసాదాల్లో నాణ్యత పాటించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, పీసీసీ సభ్యుడు బోడా వెంకట్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద, నాయకులు చింతాడ వెంకటేశ్వరరావు, కొవ్వూరు నగర అధ్యక్షుడు గంధం బాపూజీ బాబీ, రాజానగరం ఇన్‌ఛార్జి ముంద్రు పెదబాబు, నిడదవోలు నాయకులు చిన్నం మురళీ తదితరులు పాల్గొన్నారు.



ఏబీఎన్ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలి

కొవ్వూరు, సెప్టెంబర్ 24: విద్యార్థులు చిన్నతనం నుంచే సేవా భావాన్ని అలవర్చుకోవాలని ఏబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు అన్నారు. మంగళవారం కొవ్వూరు పట్టణంలోని ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బారావు పలు అంశాలపై మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సత్యనారాయణ, అధ్యాపకులు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జె.సునీత ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి మాధార్ సాహెబ్ ఎన్ఎస్ఎస్ ఉద్దేశాలను, ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించగా, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కడియంలో చిరుతపులి సంచారం

పాదముద్రలు పరిశీలించిన అటవీశాఖ అధికారులు

పులివేనని నిర్ధారణ....స్థానికుల్లో భయాందోళన



పులి పాదముద్రలు

కడియం, సెప్టెంబరు 24: కడియం-వీరవరం రోడ్డులో జీఎస్ఆర్ ఫంక్షన్‌హాలు వెనుక ఓ పొలంలో మంగళవారం చిరుత పులి సంచరిస్తున్నదనే వార్త కడియం మండల ప్రజలను భయాందోళనలకు గురిచేసింది. జీఎస్ఆర్ వెనుక ఉన్న నర్సరీలో కడియపులంకకు చెందిన మధు అనే రైతు పులిని చూసి భయాందోళనలకు గురవడంతో పాటు పరుగులు తీసారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందడంతో హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకుని అవి చిరుతపుల్లి పాదముద్రలుగా నిర్ధారించారు. విషయం బయటకు రావడంతో అటవీశాఖ అధికారులు కడియం చేరుకున్నారు. ప్రజలు గుంపులుగా వెళ్లాలని, రాత్రి సమయంలో బయటకు రావద్దని చెబుతున్నారు. కడియపులంక గ్రామంలో దోసాలమ్మకాలనీ ప్రజలు భయంతో వణికిపోతున్నారు. నర్సరీ కార్మికులు ఎవరూ బుధవారం పనుల్లోకి రావద్దని నర్సరీ రైతులు చెబుతున్నారు.

దివాన్ చెరువులో మూడు రోజులుగా జాడ లేదు : దివాన్‌చెరువు ప్రాంతంలో మూడు రోజులుగా చిరుత జాడ లేకపోవడం, మంగళవారం రాత్రి నర్సరీ ప్రాంతంలో కనిపించడం అటవీశాఖ అధికారులు పులి జాడలే అని నిర్ధారించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పులి ఈ ప్రాంతం నుంచి ఎక్కడికి వెళ్లిందనేది అంతు పట్టడం లేదు. నర్సరీలో సీసీ కేమేరాలు ఉంటాయి. రైతులు నర్సరీల్లో ఉండటానికి సాహసించడం లేదు. గంటకు 100 కిలోమీటర్ల వేగం కంటే ఎక్కువగా పయనించే ఈ చిరుత నర్సరీల్లో ఉందా ? అక్కడి నుంచి సమీపంలో ఉన్న మండపేట, ఆలమూరు మండలాల వైపు వెళ్లిందా? లేక కడియంలోనే ఉందా ? అనేది చర్చాంశనీయంగా మారింది.

విద్యార్థులకు బహుమతులు అందజేత

దేవరపల్లి, సెప్టెంబరు 24: దేవరపల్లి చైతన్య స్కూల్‌లో బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బాలల కోసం భారత రాజ్యాంగం ప్రవేశిక పుస్తకం నుంచి రాజ్యాంగం పై పరీక్షా పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులు 136 మంది పాల్గొన్నారని ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ఎస్.లలిత, వై.విజయ, పీ.తన్నీతలకు బాలోత్సవ కమిటీ సభ్యుడు ఉండవల్లి కృష్ణారావు మెమోంటోలు అందజేశారు. పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కిషోర్, ఏజీఎం పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు ఎంపీడీవోగా శ్రీదేవి

చాగల్లు, సెప్టెంబరు 24: మండల ఎంపీడీవోగా ఆర్ శ్రీదేవి నియమితులయ్యారు. ఆమె గోపాలపురం మండలం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా చాగల్లుకు రానున్నారు. ఎన్నికల సమయంలో పనిచేసిన ఎన్.బుజ్జి బదిలీపై వెళ్లిపోగా ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంపీడీవోగా సూపరింటెండెంట్ నిర్మలకుమారి వ్యవహరిస్తున్నారు.

'ఉండి ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి'

నల్లజర్ల, సెప్టెంబరు 24: ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు డిమాండ్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ళ మండలం ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీని ఎమ్మెల్యే స్వయంగా చింపివేయడాన్ని నిరసిస్తూ ఘంటావారిగూడెంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు ఒక రోజు రిలే నిరహార దీక్ష చేశారు. కార్యక్రమంలో గుదే సుబ్బారావు, పిల్లి కాంతారావు, తోట రామారావు, కూరపాటి శ్రీను, దొబ్బిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పెరవలి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్



కొవ్వూరు మండలం వేములూరులో ఎమ్మెల్యే ముప్పిడి

అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

పెరవలి, సెప్టెంబరు 24: అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని ఆయన విమర్శించారు. దీపావళికి ఉచిత గ్యాస్ బండ్‌ల పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గానికి రూ.12 కోట్ల ఉపాధి హామీ నిధులతో రోడ్ల మరమ్మతులు చేపడతామన్నారు. గత ప్రభుత్వం తిరుపతి లడ్డులో కల్తీ నెయ్యిని ఉపయోగించారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శేషారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఖజానాను పూర్తిగా ఖాళీ చేసిందని, అయినప్పటికి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమావేశంలో గ్రామానికి చెందిన పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు 96 వేల విరాళం చెక్కును విజయవాడ వరద బాధితుల నిమిత్తం దుర్గేష్‌కు అందజేశారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన సీమంతం కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. సమావేశంలో కూటమి నాయకులు అతికాల శ్రీను, పిప్పర రవి, పెన్మత్స సుబ్రహ్మణ్య వర్మ, సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి, ఎంపీటీసీ గుడాల రంగారావు తదితరులతో పాటు, ఎంపీటీసీ రమేష్, తహసీల్దార్ అచ్యుత కుమారి, ప్రత్యేకాధికారి వినయ్ సునీల్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై ఆరా

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వక్తలు

కొవ్వూరు, సెప్టెంబర్ 24: ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూరు మండలంలోని వేములూరు, తోగుమ్మి గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి 100 రోజుల పాలనను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో దాయన రామకృష్ణ, అక్కిన రాంబాబు, ఇమ్మణి ప్రసాద్, మజ్జి శేఖర్‌బాబు, ఎంపీపీ కాకర్ల నారాయుడు తదితరులతో పాటు మద్దూరు సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంద రోజుల పాలనపై హర్షాతిరేకాలు

నిడదవోలు, సెప్టెంబరు 24: ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని 24వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడారు. అనంతరం ఇంటింటికి వెళ్ళి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్‌ను అంటించారు. కార్యక్రమంలో తిరుపతి సత్యనారాయణ, గంగుమళ్ళ ప్రభావతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ సమస్యలపై కేంద్రమంత్రికి వినతిపత్రం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 24: రాష్ట్రంలో పౌల్ట్రీ రైతుల సమస్యలపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం అందజేసినట్లు రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కోమట్లపల్లి వెంకట సుబ్బారావు తెలిపారు. పౌల్ట్రీ రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, గుడ్డు ఎగుమతి, దాణా కొనుగోలులో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి ద్వారా వినతిపత్రం అందజేసినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో పౌల్ట్రీ ఫెడరేషన్ నాయకులు గన్నమని వెంకట సుబ్రహ్మణ్యం, గొడితి గంగాధర్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం ఇస్తున్న పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు

అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

కొవ్వూరు, సెప్టెంబర్ 24: అక్రమంగా నిల్వ ఉంచిన 21 గ్యాస్ సిలిండర్‌లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొవ్వూరు మండలం పశివేదల గ్రామంలో ఒక ఇంట్లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌లను అక్రమంగా నిల్వ ఉంచారని సమాచారం రావడంతో మంగళవారం విజిలెన్స్, రెవెన్యూ అధికారులు తనిఖీచేశారు. కొవ్వూరు లక్ష్మీ గణపతి గ్యాస్ ఏజెన్సీస్‌లో డెలివరీ బాయ్ గారపాటి దుర్గబాబు గ్యాస్ సిలిండర్‌లు పంపిణీ చేయకుండా అక్రమంగా 14 గ్యాస్ సిలిండర్‌లు, వివిఎస్ షుగర్స్ ఎక్స్ లిమిటెడ్‌లో పార్ట్‌టైమ్ డెలివరీ బాయ్ గారపాటి వెంకట్రావు గ్యాస్ సిలిండర్‌లు పంపిణీ చేయకుండా అక్రమంగా 7 గ్యాస్ సిలిండర్‌లు నిల్వ ఉంచినట్లు గుర్తించి వాటిని చేసుకున్నారు. అక్రమంగా గ్యాస్ సిలిండర్‌లు నిల్వ ఉంచిన వ్యక్తులపై కేసు నమోదు చేశారు. రీజనల్ విజిలెన్స్ ఎస్.పి కె.ఎస్.ఎస్.వి. సుబ్బారెడ్డి మాట్లాడారు. ఈ తనిఖీలో విజిలెన్స్ అధికారి నాగ వెంకటరాజు, కిసోర్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

కొవ్వూరు, సెప్టెంబర్ 24: గోష్పాద క్షేత్రంలోని పిండ ప్రదానాలరేవులో ఆదివారం పట్టణ పోలీసులు గుర్తించిన మృతుని ఆచూకి లభించినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. ఈ నెల 22న కొవ్వూరు పిండాలరేవులో గోదావరిలో గుర్తు తెలియని మృతదేహాన్ని పట్టణ పోలీసులు కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించిన సంగతి తెలిసిందే. పత్రికలలో వచ్చిన వార్తల నేపథ్యంలో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన శ్రీలంశెట్టి సత్యాజీరావు(74)గా గుర్తించారు. ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు.

కొవ్వూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.వి.శివప్రసాద్

కొవ్వూరు, సెప్టెంబర్ 24 : కొవ్వూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.వి. శివప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం జంగారెడ్డిగూడెం నుంచి కొవ్వూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.వి. శివప్రసాద్, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా వి.ఎల్ ప్రవీణలు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఏఎంవిఐగా పనిచేసిన జమీర్ ఏలూరు బదిలీ అయ్యారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి

కొవ్వూరు, సెప్టెంబర్ 24: కొవ్వూరు సత్యవతినగర్‌లో వైసీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జక్కంపూడి రాజా, గూడూరి శ్రీనివాస్ ప్రారంభించారు. కొవ్వూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తలారి వెంకట్రావు నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్‌చేసి పుట్టినరోజును జరుపుకున్నారు.తలారి వెంకట్రావుకు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కంఠమణి రమేష్, పేరిచర్ల బోసురాజు, రుత్తల భాస్కరరావు, తోట రామకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.



గోనె సంచుల సరఫరాలో జాప్యం లేకుండా చూడాలి

ఉండ్రాజవరం, సెప్టెంబరు 24: రైతులకు గోనెసంచుల సరఫరాలో జాప్యం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జేసీ ఎస్.చినరాముడు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రైతుసేవా కేంద్రాలతో పాటు, సచివాలయాలు, సొసైటీలను ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి పలు సూచనలు చేశారు. పొలంబడి నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా వాటిని కొనుగోలు చేయాలన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మేలా రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పొలంబడి పోస్టర్‌లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్, ఏవో ఎం.విశ్వాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ డిప్యూటీ ఈఈగా కృష్ణనాయక్

కొవ్వూరు, సెప్టెంబరు 24: కొవ్వూరు విద్యుత్‌శాఖ డిప్యూటీ ఈఈగా ఎం.కృష్ణనాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కొవ్వూరులో పనిచేసిన పి.అచ్చుతాచారి అమలాపురం బదిలీపై వెళ్లారు. బొమ్మూరు హెచ్.టి మీటర్స్ విభాగంలో డిప్యూటీ ఈఈ గా పనిచేస్తూ బదిలీపై కృష్ణనాయక్ కొవ్వూరు వచ్చారు. ఈ సందర్భంగా నాయక్‌ను కార్యాలయ ఉద్యోగులు ఏఈలు స్వాగతం పలికారు.

విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా నారాయణ అప్పారావు బాధ్యతల స్వీకరణ

నిడదవోలు, సెప్టెంబరు 24: నిడదవోలు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా మంగళవారం ఎన్.నారాయణ అప్పారావు బాధ్యతలు స్వీకరించారు.. ఏలూరు డివిజన్ నుండి నిడదవోలు డివిజన్‌కు సాధారణ బదిలీల్లో భాగంగా నారాయణ అప్పారావు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇ.ఇ.గా విధులు నిర్వహించిన బి.వీరభద్రరావు జగ్గంపేట బదిలీపై వెళ్లారు.